నవంబర్ - 2022

# హన్నాకృప

ఆధ్యాత్మిక మాస పత్రిక

గౌరవ సంపాదకులు :

**కె. సామ్యేల్ రాజేంద్ర**

సంపాదకులు :

**కె. ఇమ్మానియేల్ రాజేంద్ర**

చందా వివరాలు :

సంవత్సర చందా రూ. 350/-

పోషక చందా రూ. 1500/-

జీవితచందా రూ. 5000/-

చిరునామా :

ఎడిటర్, హన్నాకృప

పోస్ట్‌బాక్స్ నెం. 51 , క్లాపేట, 6వలైను

ఒంగోలు-523001, ప్రకాశంజిల్లా

సెల్ : 9440217726

బ్యాంక్ అకౌంట్ వివరాలు :

A/c Name: **K. Emmanial Rajendra**

A/c No.: **10957294340**

Bank: SBI Main Branch, Ongole

IFSC Code : SBIN0000890

## విషయసూచిక



| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| జప్పుత్వనేహు | కొడవటికంటి | 03 |
| ఐ లవ్ యూ సోమచ్ | ఇమ్మానియేలు రాజేంద్ర | 06 |
| నా చిత్తానుసారుడు | కొడవటికంటి | 07 |
| యోబు భార్య | | 09 |
| నిబంధన రక్తం | ఎ.ఎన్.ఆర్.జక్కం | 10 |
| సాక్ష్యము | ప్రభురెడ్డి, ఒంగోలు | 12 |
| నిన్నటి దినము | | 14 |
| వివేకముగల రాజు | చిన్నపిల్లల పేజి | 16 |
| కృపాదానం | కొడవటికంటి | 18 |
| దేవుని ప్రేమించుదాం | | 20 |
| దేవుడు - సిరి | | 21 |
| లోకంతీరు | ఇమ్మానియేలు రాజేంద్ర | 22 |





సీరియల్ నంబరు

# సంపాదకీయం.....



హన్నాకృప పాఠకులకు  కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర నమస్కారములు.

పత్రిక ప్రారంభించినప్పటి నుండి నేటి వరకు పాఠకులు చూపిస్తున్న అభిమానము, వారి ప్రార్ధనలు మాకు ఎంతో బలాన్ని ఇస్తున్నాయి. ఈ రోజుల్లో పత్రిక రన్ చేయటం కత్తి మీద సాము లాంటిది అయినప్పటికీ, ఎంతటి తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ, పాఠకులను నిరుత్సాహపరచటానికి మాకు మనసు రాక ఎలాగోలా ప్రతి నెలా పత్రికను విడుదల చేస్తున్నాము. ఎప్పటికప్పుడు ప్రతి నెలా మేము పత్రిక విడుదల కొరకు ప్రభువు వైపే చూస్తున్నాము. అయితే చాలామంది పాఠకులు పత్రికను చాలాకాలంగా ఉచితంగానే పొందుతున్నారు. పత్రిక కావాలని చాలామంది ఉత్తరాల ద్వారా, ఫోన్ ద్వారా అడుగుతూనే ఉన్నారు. పత్రికను పొందే ప్రతి ఒక్కరూ సంవత్సర చందా పంపడం ద్వారా మేము అనేకమందికి పంపగలము. పాఠకులు దయతో అర్ధంచేసుకోగలరని ఆశిస్తున్నాము. పాఠకులకు మరొక మనవి. పత్రికలో మేము ప్రచురిస్తున్న శీర్షికల గురించి మీ స్పందన కోరుతున్నాము. ఎందుకంటే మీ స్పందన ద్వారా మీ అభిరుచులకు తగిన ప్రసంగాలు, సీరియల్స్, ఇంకా మీకు నచ్చే ఆర్టికల్స్ ప్రచురిస్తాము. అలాగే బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా మీరు బైబిల్ జ్ఞానం సంపాదించుకోగలరు. ఏది ఏమైనప్పటికీ "హన్నాకృప" మాస పత్రిక మీ ఆధ్యాత్మిక జీవితానికి ఎంతో ఉపయోగపడాలని మేము చాలా కృషి చేస్తున్నాము కాబట్టి, మీ యొక్క సహాయ సహకారాలను కోరుతున్నాము. ప్రభువు మిమ్ములను, మీ కుటుంబాలను దీవించును గాక!

దయచేసి చందా కట్టని వాళ్ళు, మీ సంవత్సర చందా కట్టి పత్రిక అభివృద్ధికి తోడ్పడవలసినదిగా కోరుచున్నాను. మీరు ఫోన్‌పే ద్వారా చందా పంపాలనుకుంటే పత్రికలో 5వ పేజీలో ముద్రించబడిన క్యూఆర్ కోడుని ఫోన్‌పే ద్వారా స్కాన్ చేసి పంపవచ్చును.  మీరు ఫోన్‌పే ద్వారా చందా కట్టినట్లయితే దయచేసి మాకు 9440217726 నంబర్‌కి ఫోన్ చేసి చెప్పండి లేదా  మీ పేరు, పత్రిక అడ్రస్ లేబుల్ మీద మీ సీరియల్ నంబర్, ట్రాన్స్‌ఫర్ చేసిన మొత్తం SMS చెయ్యండి. దేవుడు మిమ్మును సదాకాలము దీవించును గాక! ఆమెన్!

–కొడవటికంటి  సామ్యేల్ రాజేంద్ర, ఎడిటర్

**K. Emmanial Rajendra,  SBI Main Branch, Ongole**
**A/c No. 10957294340**

# జప్నత్పనేహు

(యోసేపు జీవితచరిత్ర)

- కొడవటికంటి

నఫ్తాలి యూదా ముఖం చూచినప్పుడు కొదమసింహం ముఖంలాగా కనపడింది, కొద్దిగా నీరసం వచ్చింది.

యోసేపు చాలా దగ్గరగా వచ్చి ముందుగా యూదాని కౌగిలించుకొని ముద్దు పెట్టుకున్నాడు. కానీ యూదా ముద్దు పెట్టుకొనక పోవటం చూచి ఆశ్చర్యపడ్డాడు. మిగిలిన వారు మామూలుగా, ఇంతకుముందులా తనతో క్షేమ సమాచారం అయినను అడగటం లేదు. కనుక యూదాని చూచి యోసేపు "అన్నా జ్యేష్టుడు ఎక్కడ? ఇందాక కొండ కొన నుండి నేను గుర్తించింది రూబేనన్ననే కదా!" అని అడిగాడు.

"రూబేనన్నే! జెబూలూను, ఇశ్శాఖారు, లేవీకి నీ రాక సమాచారం తెలియజేయ టానికి వెళ్ళాడు. వారిలో ఇద్దరిని తీసుకొని కొద్దిసేపట్లో వస్తాడు. రా యోసేపు! కూర్చో, అమ్మ నాన్నలు బాగున్నారా?" అని అడిగాడు యూదా.

గాదు యోసేపు దగ్గరగా వచ్చి "ఏరా రంగుల అంగీ వాడా, మళ్ళీ ఏమన్నా కలలు వచ్చాయా?" అని ఆ అంగీ పట్టుకొని లాగాడు.

అప్పుడు నఫ్తాలి "అంత తొందరెందుకు? ఈసారి వాడు ఈ దేశానికి రాజు అవుతాడు. మనమందరము ఐగుప్తులోని బానిసలాగానో లేకపోతే వీడు ఎక్కి వచ్చిన గాడిద ఐగుప్తులాగానో వీడి కలలోకి వచ్చి ఉంటాము కదూ యోసేపూ?" అంటూ నెత్తిమీద ఒక్కటి కొట్టాడు. ఆ దెబ్బకి యోసేపు తల దిమ్మన్నది. కళ్ళు తిరిగినట్లు అనిపించింది. "దాహం!" అంటూ యూదా వైపు పరుగెత్తబోయాడు.

యూదా కోపంగా గబగబ వెళ్ళి నఫ్తాలి చెయ్యి గట్టిగా పట్టుకొని లాగి, "జాగ్రత్త! మీరు చెయ్యదల్చుకున్నదేదో మీరు ఒప్పుకొనినట్లు చెయ్యండి. కానీ హింసింపవద్దు" అన్నాడు.

ఈ లోపల దాను యోసేపు అంగీని చించి బయటకు లాగితే అది రాలేదు. అది అతనికి ప్రేమపూరితమైన, విచిత్రమైన అంగీ. అది చించితే బయటకు రాదు. యూదా హృదయం విలవిలలాడింది. యోసేపు ముఖం చూడలేక పోయాడు. యోసేపు శరీరంపై సాధ్యమైనంత తక్కువ దెబ్బలు పడాలని చూస్తున్నాడు.

యోసేపుకు పరిస్థితి ఏమి అర్థం కావటంలేదు. దుఃఖం ఆగలేదు. యూదా అన్న మాట అర్థమేంటో ఆలోచిస్తున్నాడు. ఔను, యూదా ఏమన్నాడు? 'మీరు చెయ్యదలచినదేదో మీరు ఒప్పుకొన్నట్లు చేయండి' అంటే ఈ విధమైన హింస ముందు గానే ఏర్పాటైనదా? తనని చంపుతారా? అయితే చంపే టప్పుడు మరలా కట్టుబాట్లు ఏమిటి? అసలు తనని కొండ మీద నుంచి పిలిచిన పెద్దన్న ఏమయ్యాడు? ఆయనకు కూడా ఏదైనా అపాయం కలిగించారా? అందరిలో యూదా హెచ్చింపబడినవాడు, కొదమ సింహం వంటివాడే! ఎందుకు ఈరోజు కోపం దుఃఖ మిళితమైన స్వరంతో మాట్లాడు తున్నాడు? యూదా హృదయం తను ఇప్పుడే చూసి వచ్చిన నీళ్ళులేని గుంటవలె ఉంది.

తన అంగీ చించుతున్నారే! అయ్యో దేవుడా! ఈ ప్రయాణం అంతటిలో నా ప్రక్కనే ఉన్నట్లు ఉన్నావే! బేతేలు నుండి నన్నంటి వచ్చిన నీ స్పర్శ, గాలివంటి వినికిడి ధ్వని, హృదయాన్ని అంటిన అనుభూతి ఏవి? వీళ్ళెందుకు ఇలా చేస్తున్నారు? వీరిని ఎప్పుడైనా నోరెత్తి ఒక్క దుర్భాషైనా మాట్లాడలేదే? అయ్యో, నా అంగీ చినిగిపోతుంది. వీరి దగ్గర ఉండే కత్తులు ఇప్పుడు లేవే? ఉంటే వాటితోనే ఈ అంగీ చించి ఉండేవారు. అసలు రూబేనన్న ఏడి?

"యూదా అన్నా!" అని పెద్దగా అరిచాడు. ఇప్పుడు యూదా దూరమవుతున్నాడు. "అన్నా....... రూబేనన్నా!" అని పిలిచాడు. ఆ ధ్వని ఆ కొండకు గుద్దుకొని తిరిగి తన యొద్దకే వచ్చినట్లుగా అనిపించింది. "రూబేనన్నా....

పెద్దన్నా... పెద్దన్నా..!" అని ఇంకా పెద్దగా అరుస్తున్నాడు. అదుగో యూదా అన్న వస్తున్నాడు, దగ్గరకు వచ్చాడు.

దాను.... దాను... ఆగు" అన్నాడు.

దాను చెయ్యి యోసేపు మెడ మీద ఉంది. యోసేపును గట్టిగా నెడుతూ అడవిలో ఉన్న ఆ గుంట యొద్దకు యోసేపును ఈడ్చుతున్నారు. "దాను... దాను.... ఆగు! అనేకసార్లు మన తండ్రి నిన్ను మడిమెను కరచేవాడు కట్లపాము వంటివాడు అన్నాడు. అది నిరూపించవద్దు. ఆ చిన్నవాని మీద దౌర్జన్యం చెయ్యవద్దు. అందరూ దూరంగా ఉండండి" అంటూ అందర్నీ నెట్టి వేస్తున్నాడు. కానీ నలుగురితో ఒక్కడు, అతనికి ఎన్ని చేతులున్నాయి?

ఇప్పటికి దాదాపు గుంట దగ్గరికి వచ్చేశారు. దాను ఇప్పుడు గుంట లోపలి భాగములోకి వచ్చాడు. యోసేపు కాళ్ళ మడిమెలు పట్టుకొని గట్టిగా గుంజాడు. నఫ్తాలి, గాదు, యూదాని గట్టిగా క్షణం పట్టుకోగలిగారు. అంతే.... యోసేపు లోపలికి దొర్లుతున్నాడు. అది బావిలాగా నిటారుగా లేదు. గుంటలాగా పల్లుగా ఉన్నా, బావి అంత లోతుగా ఉంది. రాళ్ళు లేకపోయినా కాలిన ఇసుక, ఎండి రాలిన చెట్ల ఆకులతో నిండి ఉంది. యోసేపు గుంట లోపలికి దొర్లేటప్పుడు పెట్టిన ఆక్రందనలో సగం అతని దేహం ఆ గుంట ఒడ్డును రాసు కుంటూ చేసే ధ్వనిలో కలిసిపోయి భూమిలో నుండి వచ్చే ధ్వనిలాగా వినబడింది.

ఇప్పుడు యోసేపు ఏడుస్తున్నాడో, అరుస్తున్నాడో, పిలుస్తున్నాడో అర్థం కావటం లేదు. కొంచెంసేపటికి యోసేపు దగ్గర నుండి ఏ శబ్దం రాలేదు. పై నుండి చూస్తే లోపల చీకటిగా ఉంది. నిశ్శబ్ధం, అంతా నిశ్శబ్ధం. గాలి కూడా కొంచెంసేపు స్థంభించింది. అడవి చెట్ల కొమ్మలు ఊగలేదు. యూదా మనసు, శరీరం తన నుండి దూరమైనట్లు భావించాడు. ఏదో తప్పు చేసిన వాడిలా, దీనంతటికి తనే కారకుడిగా తనే దీనికి కర్తగా, సిగ్గుతో అవమానంతో మనోక్షోభతో 'ఇదేంటి నా అంగీ ఇలా ఉంది? తన రొమ్ము అంతా తడిసి ముద్ద అయింది. ఇదంతా నా కన్నీరేనా?' అనుకున్నాడు. ఇంతగా తను తన జీవితంలో ఎన్నడూ రోధించలేదు.

షెకెములో షిమ్యోను, లేవి చేసిన వధ, చనిపోయి పడి ఉన్న శవాలను, వారి మీద పడి విలపిస్తున్న భార్యల, పిల్లల ఆర్తనాదాలు విని చూసినప్పుడు తను రెండు మూడు కన్నీటి బొట్లు తప్ప ఎక్కువ కార్చలేదు. మరి ఇదేంటి? యోసేపును తను ఇంతగా ప్రేమిస్తున్నాడా? నిజంగా తన హృదయంలో ప్రేమ ఉందా? ఇది నటనా? అయ్యో దేవుడా, ఏమి శబ్ధం రాదే! ఎందుకు ఇలా జరిగింది? తన తండ్రి మాటిమాటికి 'నా సమస్త ఉపద్రవములలో నుండి నన్ను కాపాడిన దేవుడు' అని అంటుండేవాడు. ఏడి దేవుడు? తన ప్రియమైన కుమారుడు ఈ రకంగా మరణిస్తే.

"అన్నా!" అన్న మూల్గు లోపల నుండి వినిపించింది. ఆ పిలుపు బహుదీనంగా ఉంది. "యూదా అన్నా!" అని మరలా పిలుపు. అవును అది యోసేపు స్వరమే. యోసేపుదే... యోసేపు. అంత దుఃఖంలో ఇదో శాంతి. యోసేపు చని పోలేదు. ఏమైనా గాయాలు అయివుండొచ్చు. యోసేపు... నా తమ్ముడు బ్రతికే ఉన్నాడు. వృద్ధుడైన నా తండ్రి దేవుడు కాపాడాడు. 'యోసేపూ!' అని అరవాలనుకున్నాడు. కాని గొంతు పెగలలేదు. మరలా గొంతు సరిచేసుకుని "యోసే!" అన్నాడు.

"అన్నా" అని శబ్ధం వచ్చింది.

"భయపడొద్దు! నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు. నేను బ్రతికి ఉండగా నువ్వు చనిపోవు. నా మరణం తర్వాతే నీది, ధైర్యంగా ఉండు" అని చుట్టూ చూశాడు.

దాను, నఫ్తాలి యోసేపు గాడిదను, ప్రక్కన ఉన్న గాడిదను నడిపించుకుంటూ అడవిలో నుండి బయట విశాలంలోకి, ఐగుప్తు వెళ్ళే రాజమార్గము దగ్గరికి వెళ్తున్నారు. చాలాదూరం వెళ్తున్నారు. అదిగో అక్కడ ఆ చెట్టు క్రింద ఆగి భోజన పదార్థములు దించుతూ ఉన్నారు. వారి ముఖాలు స్పష్టంగా కనిపించడంలేదు. ఆషేరు నీళ్ళ తిత్తి తీసుకొని వెళ్తున్నాడు.

యూదా ఆ గుంట చుట్టూ చూచాడు. లోనికి దిగితే ఇక ఎక్కి రావటానికి వీలులేదు. ఇది మృత్యు ముఖమే! అయితే ఏమి యోసేపు బ్రతికే ఉన్నాడు. అంతేచాలు! ఆకాశంలో

మేఘం ప్రక్కకి తప్పుకున్నది. సూర్యుడు ఇప్పుడు చెట్ల ఆకులలో నుండి ప్రకాశిస్తూ కనిపిస్తున్నాడు. యోసేపు మీద వెలుతురు పడింది. యూదా చూశాడు. యోసేపు నొప్పి పెడుతున్నట్లుగా తలదించుకున్నాడు. "తమ్ముడూ..!" అని చిన్నగా సాధ్యమైనంత చిన్నగా యోసేపుకు మాత్రమే వినపడేలా పిలిచాడు.

యోసేపు తల పైకి ఎత్తాడు. "తమ్ముడూ! ఈ రకంగా నిన్ను గుంటలో పడవేయటానికి నేనూ, రూబేను అన్న ఒప్పుకొనకపోయినట్లయితే దాను, నఫ్తాలి, గాదు, ఆషేరు లను మేము చంపవలసివచ్చేది. ఏమైనా సరే, కొంచెం ఓపిక పట్టు, నిన్ను బయటకు తీస్తాను" ఎండిపోయిన గొంతును సరిచేసుకుంటూ సాధ్యమైనంత సౌమ్యంగా ఓదార్పుగా మాట్లాడి లేచాడు.

గాడిదల వైపు నడుస్తుంటే గుంటలో నుండి సన్నని మూలుగు వినబడుతుంది. యూదా నడిచే కొలది ఆ మూలుగు దూరం అయింది. రూబేను ఖచ్చితంగా వస్తాడు. తొందరలోనే వస్తాడు. యూదాకి మరలా ఒక అనుమానం వచ్చింది. ఇప్పుడు నలుగురం కలసి అంటే లేవి మందల దగ్గర ఉంటాడు కదా! జెబూలూను, ఇశ్శాఖారు, రూబేను, తను కలసి దాను, నఫ్తాలి, ఆషేరుల శక్తిని మించి యోసేపును ఇంటికి పంపించినా అది చాలా అనర్థాలకు తీస్తుంది. యోసేపు చినిగిపోయిన అంగీ, చీరుకు పోయిన శరీరం తన తల్లి, తండ్రి కనిపెడతారు. చిన్నమ్మల పిల్లల దుష్టత్వం బయటకు వస్తుంది. వీరి దుష్టత్వం తన పెద్ద తాత ఇష్మాయేలు అసహనం కంటే ఘోరమైనదిగా అనిపిస్తుంది. తన తండ్రి ఈ దాసీల పిల్లలను క్షమించడు. కుటుంబం చిన్నాభిన్నం అయిపోతుంది. యోసేపు కొంతకాలం వీరికి దూరంగా ఉంటేనే మంచిది. తండ్రి కొంతకాలం దుఃఖించినా తన కుమారుణ్ని ఏదో ఒకరోజున చిరంజీవిగా చూస్తాడు. ఇదేంటి తన మనసులోనికి ఇలాంటి ఆలోచనలొస్తున్నాయి. అయినా యోసేపును ఎక్కడికి పంపగలము? ఎలా పంపుతాము? ఏనాడు తండ్రిని విడిచినవాడు కాడు. సొంతంగా తన పనులే తను చేసుకోలేడుకదా!

దాసీల కుమారులు నలుగురు యోసేపు తెచ్చిన బస్తాలు విప్పి చూస్తున్నారు. వేయించిన మాంసం, రొట్టెలు, గోధుమలు, జున్నుముక్కలు, ఎన్ని ఉన్నాయి! ఇవి చూసి ఎంతకాలం అయ్యింది! పాపం చిన్నవాడు యోసేపు – వాటిని తీసుకొని ఎంతో ప్రయాసతో వచ్చాడు.

కనీసం ఈ భోజన పదార్థాలు తెచ్చిన దానికైనా కృతజ్ఞతగా యోసేపును వారు బయటకు లాగుతారేమో! ఆహారం తీసుకొని ఆకలి తీరిన తర్వాతైనా వారు తమ పగ మర్చిపోయి జాలిపడతారేమో అనుకుంటూ వారి ప్రక్కన కూర్చున్నాడు. భోజనం తాకబుద్ధి కాలేదు. అయినా ఇప్పుడు తాను వారిలో ఒకడు అయిపోవాలి. వాళ్ళకు వ్యతిరేకి అని వాళ్ళు అనుకొనకూడదు. తాను కూడా వారి వంటి స్వభావం కలవాడని వాళ్ళు అనుకుంటే కాని ఇప్పుడు తను ఏదైనా ఆలోచించగలడు. ఇష్టం లేకపోయినా వారి మధ్య కూర్చున్నాడు.

**(సశేషం)**

**ఫోన్‌పే ద్వారా లేదా గూగుల్ పే ద్వారా**
**చందా పంపించాలంటే**
**ఈ క్రింది క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి**

Scan & Pay Using PhonePe App

Emmanial Rajendra




# 'ఐ లవ్ యూ సో మచ్'




'ఐ లవ్ యూ సో మచ్ రా నాన్న' అని తల్లిదండ్రులు బిడ్డలతో అంటుంటారు కదా! అలాగే బిడ్డలు కూడా తల్లిదండ్రులతో అంటారు. సరే, ఒకే రక్తం పంచుకొని పుడతారు కాబట్టి ఆ మాత్రం ప్రేమ ఉండటం సహజమే. ఎవరు ఎవరో తెలియకుండా అప్పటికప్పుడే వివాహబంధం ద్వారా ఒకటయ్యే భార్యాభర్తల మధ్య 'ఐ లవ్ యూ సో మచ్ డార్లింగ్' అనుకోనేంత ప్రేమ పొంగి పొర్లుతుంది. ఓకే, వాళ్ళు భార్యభర్తలు కాబట్టి జీవితాంతం కలిసి వుండాలి కాబట్టి, మనసులో ఉన్నా లేకపోయినా ఐ లవ్ యూ చెప్పుకొనే భార్యభర్తల మధ్యలో అలాంటి ప్రేమ ఉండటం కూడా సర్వ సాధారణం. ఇంక ముఖ్యమైన ప్రేమ ఒకటుంది. ఇలాంటి వాళ్ళ వల్లనే ప్రేమకు అనేకమైన నిర్వచనాలు, కవితలు పుదుతుంటాయి. వాళ్ళే మిస్టర్ అండ్ మిస్ యూత్. అబ్బో, అసలు ప్రేమ కోసమే పుట్టినట్లుగా ఉంటారు కొంతమంది. లైలా-మజ్ను, సలీమ్- అనార్కలీల వారసులే మన యూత్. వాళ్ళ ప్రేమకి పగ్గాలే ఉండవు. హత్యలు, ఆత్మహత్యలే వాళ్ళ ప్రేమకు నిదర్శనం. జనాలు కూడా 'వాళ్ళేరా నిజమైన ప్రేమికులు' అనుకునేంత రేంజ్‌లో ఉంటది వాళ్ళ ప్రేమ. తల్లిదండ్రులు బిడ్డల మధ్య, భార్యాభర్తల మధ్య, యువతీయువకుల మధ్య పుట్టే ప్రేమని 'నిజమైన ప్రేమ' అని ఎక్స్‌పోజ్ చేసుకోడానికి తెగ తాపత్రయపడతారు. వీళ్ళ మధ్య ఏ మాత్రం తేడా వచ్చినా 'కన్నప్పుడు ఎవరికోసం ప్రేమిస్తారు?' అని, 'చేసుకున్నప్పుడు ప్రేమించక చస్తావా?' అని, 'వెంటపడి తిరిగినప్పుడు తెలీదా?' అని 'ఐ హేట్ యూ సో మచ్' కి మారిపోతుంది వాళ్ళ ప్రేమ. అసలు **'ప్రేమ'** అనేది తన స్వభావాన్ని మార్చుకోగలదా? *'ప్రేమ దీర్ఘకాలము సహించును, దయ చూపించును. ప్రేమ మత్సరపడదు; ప్రేమ డంబముగా ప్రవర్తింపదు; అది ఉప్పొంగదు; అమర్యాదగా నడువదు; స్వప్రయోజనమును విచారించుకొనదు; త్వరగా కోపపడదు; అపకారమును మనస్సులో ఉంచుకొనదు. దుర్నీతి విషయమై సంతోషపడక సత్యము నందు సంతోషించును. అన్నిటికి తాళుకొనును, అన్నిటిని నమ్మును; అన్నిటిని నిరీక్షించును; అన్నిటిని ఓర్చును. ప్రేమ శాశ్వతకాలముండును' (1కొరింథీ. 13:4-8).* మనుష్యులు చెప్పుకొనే **'ఐ లవ్ యూ సో మచ్'**లో ప్రేమ యొక్క గుణాలైన ఇవన్నీ కనిపిస్తాయా? తల్లిదండ్రులైనా, కన్నబిడ్డలైనా, భార్యాభర్తలైనా, ప్రేమికులైనా సరే, వాళ్ళలో ఒకరు ఇంకొకరిని ప్రేమించకుండా తిరిగి ప్రేమించగలరా? 'యస్, నేను ప్రేమిస్తాను' అని ఎవరైనా ఆవేశంతో చెప్పగలరేమో గానీ, ఆచరణలో అది సాధ్యం కాదు. సాధ్యమైతే తల్లిదండ్రులు బిడ్డల మధ్యలో ద్వేషం పుడుతుందా? భార్యాభర్తలు విడిపోగలరా? యువతీయువకుల మధ్యలో హత్యలు జరుగుతాయా? ఆత్మహత్య చేసుకోవాలని ఒకరిని ఒకరు పురుకొల్పుకుంటారా? మనుష్యుల మధ్య ప్రేమ అది నిజమైన ప్రేమ కాదు. అది కేవలం 'ఆకర్షణ' మాత్రమే. దేవుని ప్రేమ మాత్రమే నిజమైనది. 'దేవుడు ప్రేమా స్వరూపి' *(1యోహాను 4:8). 'తమ ఆలోచనల ననుసరించి చెడుమార్గమున నడుచు కొనుచు లోబడనొల్లని ప్రజలవైపు దినమెల్ల నా చేతులు చాపుచున్నాను' (యెషయా 65:2)* అని ఎదురు చూచేటంత దేవుని ప్రేమ మనుష్యులలో ఉండదు. మిమ్మును ప్రేమించని వారిని కూడా మీరు ప్రేమించగలిగితే అది నిజమైన ప్రేమ. అప్పుడు చెప్పండి **'ఐ లవ్ యూ సో మచ్'** అని.

| ఫోన్‌పే లేదా గూగుల్ పే ద్వారా పత్రిక చందా పంపవలసిన ఫోన్ నంబరు |
| --- |
| **9 4 4 0 2 1 7 7 2 6** |

సీరియల్

1

# నా చిత్తానుసారుడు

– కొడవటికంటి

(దావీదు జీవిత చరిత్ర)

ఉదయాన్నే ఇంకా చీకటిగా ఉన్నప్పుడే నిద్రలేవటం అలవాటు అయింది. తాను నిద్రలేచి ఊరికి–కొండకి మధ్యనున్న పొలములో పాక యొద్దకు వెళ్ళాలి. మార్గమధ్యములో సెరూయా అక్క ఇంటికి వెళ్ళాలి. తన వయస్సే వున్న తన మేనళ్ళుడు అబీషై సిద్ధంగా ఉంటాడు. అబీషైకి తానంటే వల్లమాలిన ప్రేమ. చిన్న అక్క అబీగయీలు ఇష్మాయేలీయుడైన యెతెరును పెండ్లిచేసి కొన్నందున ఇంట్లో అందరికి ఆమె మీద కోపంగా ఉంది. అయితేనేమి ఆమె కొడుకు అమా3శా బహు శూరుడు.

అక్కడ పదిమంది గొఱ్ఱెల కాపరులు గొఱ్ఱెల యొద్ద పండుకొని ఉంటారు. మధ్యాహ్నపు వేళలో 'ఏలా' లోయ దక్షిణం వైపు గొఱ్ఱెలను నడిపించాలి తన కంచరగాడిద చాలా చురుకైనది. ఏలా లోయవైపుగా గొఱ్ఱెలను నడిపించడం తనకు బొత్తిగా ఇష్టంలేదు. ప్రతిరోజు సూర్యోదయ మైనప్పుడు సూర్యకిరణాలు నేరుగా తాకే ప్రదేశం తన గ్రామమైన బేత్లెహేమునకు ఆరుమైళ్ళ దూరంలో ఉత్తరముగా ఉన్నది. ఎఱ్ఱనివి ఏడు కొండలు అవే మోరియా. పితరుడైన అబ్రాహాము ఇప్పటికి వెయ్యి సంవత్సరాల క్రితం తన కుమారునితో దర్శించినవి. విశ్వాసపరీక్షలో నెగ్గిన ప్రదేశం.

అయితే తన తండ్రి ఆ కొండలలోనికి పశువులను తీసుకొని వెళ్ళటానికి ఒప్పుకొనడు. ఎందుకంటే ఆ కొండల మీద కట్టబడిన కోట పట్టణంలో యెబూసీయులు నివశిస్తున్నారు. యెహోషువ మరి ఎందుకో వారిని నిర్మూలించలేదు.

ఉదయాన్నే ఆ కొండలవైపు చూచినప్పుడు తాను పోగొట్టుకొనిన వస్తువులాగా లేక తన సొంత స్వాస్థ్యాన్ని ఎవరో ఆక్రమించుకొని అనుభవిస్తు న్నట్లుగా భావన కలిగేది. ఇలాంటి ఆలోచన ఎప్పుడూ తనను వెంటాడుతూనే ఉంటుంది. అసలు ఇశ్రాయేలీయుల స్వాస్థ్యంలో పరాయి ప్రభుత్వాన్ని దేవుడు ఎందుకు అనుమతించాడు?

ఆలోచిస్తూనే అబీషైని కలిసాడు. అబీషైకి తనను చూడగానే ముఖం వికసిస్తుంది. ప్రేమగా భుజం మీద చేయివేశాడు. "ఈ రోజు ఆలస్యం అయినదేమిటి?" అడిగాడు అబీషై.

"అదే" అంటూ మోరియా కొండల వైపు చూసాడు దావీదు.

"నీకు అదే ఆలోచనా? మనం దేవునికి సలహా ఇచ్చేవారమా? సమయం వచ్చినప్పుడు ఆ కొండలే దేవుని మందిరము కాకూడదా?" అన్నాడు అబీషై.

దావీదు హృదయం వికసించింది "ఔను ఔను ఖచ్చితంగా అవి దేవుని మందిరమవుతాయి" అన్నాడు.

అబీషై ఆలోచిస్తూ ఇంటిలోపలికి వెళ్ళి తన ఈటె పైవస్త్రము తీసుకొని వస్తూ "నీ సితార తీసుకొని రాలేదా?" అన్నాడు.

"రాత్రి గొఱ్ఱెల దొడ్డిలో ఉంచి వచ్చాను" అంటూ గొఱ్ఱెల దొడ్డివైపు దారితీసాడు.

ఆ రోజంతా మోరియా మీదనే మనస్సు నిలిచింది. సూర్యుడు నడినెత్తికి వచ్చినప్పుడు దూరంగా బేత్లెహేము నుండి రెండు గాడిదల మీద తన పనివారు రావడం కనిపించింది. అయితే ప్రతిరోజు పనివారికి, తనకు ఆహారం తెచ్చేవారు కాక తన ఇంటి గృహనిర్వాహకుడు కనిపించాడు. ఈ ఎండజామున అతని రాక దావీదుకే కాక అబీషైకి కూడా ఆశ్చర్యం కలిగించింది. అదీకాక వారు చాలా తొందరగా వస్తున్నట్లు అనిపిస్తుంది. గృహనిర్వాహకుడైన ఏలేషా అరవైదాటినవాడే ఆయన వస్తూనే....

"పెద్దయ్యగారు మిమ్మల్ని వెంటబెట్టుకొని రమ్మన్నారు" అన్నాడు.

"సంగతి ఏమిటి?" అన్నాడు అబీషై.

"దీర్ఘదర్శి సమూయేలుగారు మన ఇంటికి వచ్చారు" అన్నాడు. ఆయన రాక ఎవరినైనా కలవరపరుస్తుంది దావీదు

గుండె వేగంగా కొట్టుకొన నారంభించింది.

"ఆయన సమాధానముగా వచ్చారా?" అన్నాడు తన స్వరాన్ని సాధ్యమైనంత నెమ్మదిగా!

"ఆయన బలి అర్పించటానికి వచ్చానని వూరి పెద్దలతో చెప్పారు. కాని మన ఇంటికి వచ్చి మీ అన్నలనందరిని ఒకరి తర్వాత ఒకరిని పిలిచి పరీక్షగా చూసారు. తర్వాత వీరేనా మీ కుమారులు ఇంకా ఎవరైనా ఉన్నారా?" అని అడిగాడు.

"అందరికన్నా చిన్నవాడు దావీదు ఉన్నాడు. అయితే అతను గొఱ్ఱెలను కాయుచున్నాడు అని చెప్పారు. వానిని పిలిపించండి. అతను వచ్చేవరకు మనము కూర్చుందాం అని అన్నారు. అందువలన నేను వచ్చాను" అన్నాడు.

దావీదు వెంటనే లేచి సితార అబీపై చేతికిచ్చి గొఱ్ఱెల వైపు చూసాడు. తననే గమనిస్తున్న తన కంచర గాడిద వైపు చూసాడు. వెంటనే తలపైకెత్తి గబగబ తన దగ్గరకు వచ్చింది. గొఱ్ఱెలవైపు నుండి తల పైకెత్తి తూర్పు వైపుకు చూస్తే ఆకాశాన్ని అందుకోవాలనో లేక యెబూసీయుల నుండి విముక్తి కలిగించమనో మోరియా కొండలు కనబడ్డాయి. దావీదు ముఖం దక్షిణముగా నున్న బేత్లెహేము వైపు నడిచింది.

సమూయేలుగారు చాలా వృద్ధుడైపోయాడు. తన తండ్రి లాగానే ఆయన దేవునితో సంబంధం కలిగినవాడు. ఆయన జన్మము గురించి తన తల్లి తన బాల్యములోనే చెప్పింది ఆయనను గురించేకాదు. అబ్రాహాముగారిచరిత్ర ఇస్సాకుగారి చరిత్ర, ముఖ్యముగా యాకోబు గారు పడిన కష్టాలు ఆఖరు దినములలో ఆయన కుమారుడు ఐగుప్తు ఏలిక అవడం, ఆయనను సమాధి చేయడానికి ఐగుప్తు దేశ ప్రముఖులందరూ కదలి వచ్చి హెబ్రోనులో ఆయనను సమాధి చేయటం, మోషేగారి ద్వారా దేవుడు చేయించిన అద్భుత క్రియలు యెహోషువగారు చేసిన యుద్ధాలు, కనానును స్వాధీన పరచుకోవడం. అయితే తనకు అర్థం కాని విషయం సౌలు రాజైన తరువాత అమాలేకీయులతో యుద్ధము చేసి వారిని ఓడించినా కూడా సమూయేలుగారు ఆ రాజుని ఎన్నడూ దర్శించకుండా ఉండిపోవడం.

సౌలుగారు చాలా చక్కనివాడు. ఇప్పుడు ఆయనకు దాదాపు అరవై సంవత్సరాలు ఉన్నా మంచి పుష్టికరంగా కనబడతాడు. తన అన్నలు ముగ్గురు ఆయన సైన్యములో ఉన్నారు. వారి ద్వారా సౌలుగారు చేసిన యుద్ధములు. ఆయన కుమారుడైన యోనాతాను చేసిన అద్భుత శౌర్యము తెలిసినవి. అవి ఎన్నిసార్లు ఆలోచించాడో.

ఈ రోజు సమూయేలుగారు తనను చూడటానికి వేచి ఉండటం ఆలోచిస్తే భయము, సంతోషము రెండు కలుగు తున్నాయి ఎందుకు? ఎందుకు? అనే ఆలోచన.

చిన్నప్పటి నుండి అమ్మ ఎన్ని సంగతులు చెప్పింది? మన దేవుడు అత్యంత కరుణా సంపన్నుడని. ఆయన కనుదృష్టి లోకమంతట సంచరిస్తుం దని, తన ముత్తవ్వ రూతు వివాహ విషయంలో ఆమె ఇశ్రాయేలీయుల దేవుడైన యెహోవా రెక్కల క్రింద సురక్షితముగా ఉండుటకు మోయాబు దేశము నుండి వచ్చినదని అమ్మ చెప్పింది.

దేవుని రెక్కల క్రింద ఉన్న క్షేమం ఈ ప్రపంచంలో ఎక్కడా దొరకదని అమ్మ చెప్పేది. ఈ విషయాలను ఆలోచిస్తుంటే తన హృదయం ఎంతో నెమ్మదిగా ఉన్నది. ముఖం ప్రశాంతంగా తయారైంది. తన తలమీద నుండి ఏదో భారం తొలగిపోయి నట్లుంది.

తన ఇంటి ప్రహరి దగ్గర చాలామంది పురప్రజలు గుమి గూడి వున్నారు. తన కంచర గాడిదకు దారి ఇచ్చారు. ఇంటి నౌకరు ఒకరు వచ్చి గాడిదను తీసుకొని వెళ్ళి గుంజకు కట్టి వేశారు. తన పైవస్త్రముతో ముఖము తుడుచుకుంటూ ఇంటిలో ప్రవేశించాడు. ఇంత పెద్ద ఇల్లు ఉండటం కూడా అంత మంచిది కాదు అనిపించింది. బేత్లెహేములో అందరిలో ధనవంతుడు మా ముత్తాత బోయజుగారైతే ఆయన మనమడు ఇంకా గొప్పవాడైపోయాడు. బయట నుండి ఇంటి సావడికి రావడం ఎంత దూరం చుట్టూ ఉండే ప్రజలు రహదారిలో నుండి ఒక్క అడుగు వేస్తే ఇంట్లో వుంటాను అనుకుంటూ నడుస్తున్నాడు. తాను గొఱ్ఱెల వెంట వెళ్ళేటప్పుడు వేసుకొనే బలమైన చెప్పులు ఎప్పుడు హాస్యాస్పదంగానే ఉంటాయి. ఇప్పుడు దీర్ఘదర్శిగారి దగ్గరకు ఈ చెప్పులతో వెళ్ళాలా? ముఖం కడుక్కొని తలపాగా తీసివెళ్ళాలా? ఏమైనా అంతగొప్ప మనిషి దగ్గరకు ఈ అడవి రూపంలో ఎలా వెళ్ళాలి అనుకుంటూ ప్రక్కదారిలో నుండి వెళ్ళి సిద్దపడి నడవలో కూర్చుండిన సమూయేలుగారి దగ్గరకు వెళ్ళవచ్చును అనుకొన్నాడు.

**(సశేషం)**

స్త్రీల విభాగము

# యోబు భార్య

బైబిల్‌లో కొందరి పేర్లు వ్రాయబడి లేదు. లోతు భార్య, యోబు భార్య, షునేమియురాలు సారెపతు విధవరాలు, సమరయ స్త్రీ ఇలా కొందరి పేర్లు వారి భర్త పేరుతోనో లేక వారు నివసించే స్థలము పేరుతోనో వ్రాయబడినవి. యోబు పేరు తెలియని వారు లేరు. యోబు ఊజు దేశములో మంచి పేరు తెచ్చుకొన్నాడు. బహు సంపద కలిగినవాడు. దేవునియందు భయభక్తులు కలిగి చెడుతనమును అసహ్యించుకొనిన వాడు. అందునుబట్టి దేవుడు అతనిని దీవించాడు. అన్ని విషయాల లోను ఆశీర్వదింపబడిన యోబు తన భక్తి జీవితంలో కూడ అభివృద్ధి పొందుచుండెను.

ఈనాడనేకులు ఆర్థికంగా ఆశీర్వదింపబడిన తరువాత ఆధ్యాత్మికంగా పతనమైపోతున్నారు. అయితే యోబు ఆస్తి మీద కాక అన్ని ఇచ్చి ప్రభువు మీదే తన గురిని నిలిపాడు. యోబు భార్య యోబువలె భక్తి పరురాలు కాకపోయినప్పటికి యోబును బట్టి ఆమెయు అన్ని విషయాలలో ఆశీర్వాదమును అనుభవించు చుండెను. యోసేపు పోతీఫరు అను అన్యుని ఇంటిలో పనిచేయు చున్నప్పుడు యోసేపునుబట్టి ఆ పోతిఫరు కూడ ఆశీర్వదించ బడెను. పరిశుద్ధ జీవితం జీవించే వారు వారి మట్టుకు వారేకాక ఇతరులకుకూడ ఆశీర్వదంగా ఉంటారు. అనేకసార్లు భార్య ఆశీర్వాదాలకు అర్హురాలు కాకపోయినా భర్తనుబట్టి ఆశీర్వదింప బడుతుంది. అలాగే భర్త యోగ్యుడు కాకపోయినా భార్య యొక్క ప్రార్థననుబట్టి ఆశీర్వదింపబడతాడు. అయితే అనేకులు దీనిని గ్రహింపరు. యోబు భార్య ఈ కోవకు చెందినది. యోబుకున్న భక్తి, విశ్వాసం, ప్రార్థన యోబు భార్యకులేవు. యోబు ఉదయమున లేచి దేవునికి బలులు అర్పించేవాడని బైబిల్‌లో వ్రాయబడి ఉన్నది. యోబు భార్యలో అటువంటి ప్రార్థన లేదు. యోబు బండ మీద కట్టబడిన ఇంటివలె ఉండెను. కనుక తుఫానువలె శోధనలు శ్రమలు వచ్చినప్పుడు యోబు విశ్వాసం స్థిరంగా ఉండెను. ఒక్క దినములోనే గొఱ్ఱెలు, మేకలు, ఒంటెలు, గాడిదలు ఉన్న సమస్త ఆస్తి చివరికి కన్న పదిమంది బిడ్డలు కూడా పోయినప్పటికి యోబు 'యెహోవా ఇచ్చెను యెహోవా తీసుకొనిపోయెను' అని చెప్పి నిబ్బరంగా ఉన్నాడు. అయితే యోబు భార్య అట్లు అంగీకరించినట్లు కనబడలేదు.

యోబు చివరికి తన ఆరోగ్యమును కూడ పోగొట్టుకొని మానసికంగాను శారీరంగాను కృంగియుండగా యోబు భార్య భర్తను గౌరవించలేదు. ఆదరించలేదు. యోబుకు కష్టాలు ప్రారంభమైన తరువాత ఆమె యోబుతో ఉన్నట్లు కనిపించ లేదు. యోబు స్నేహితులు మాటి మాటికి వచ్చి పరామర్శించి వెళ్ళేవారు. కాని యోబు భార్యలో ఈ పలుకరింపు లేదు. యోబు అరికాలు మొదలుకొని నడినెత్తి వరకు బహు వేదన కరమైన కురుపులతో బూడిదలో కూర్చొని బిల్ల పెంకుతో గోక్కొనుచుండగా అన్ని పోయిన నేనున్నాను గదండి అని ఆదరించవలసిన యోబు భార్య ఇంకా ఎందుకయ్యా నీ భక్తి దేవుని దూషించి మరణము కమ్మనెను. యోబు భార్య మాటను సాతాను మాటలని గుర్తించిన యోబు మూర్ఖురాలు మాటలాడు నట్లు నీవు మాటలాడుచున్నావు. మనము దేవుని వలన మేలు అనుభవించుదుమా కీడును మనం అనుభవించ తగదా అని గద్దించెను. బలవంతుడైన సమ్సోను సాతానునిచే ప్రేరేపించబడిన దెలీలా మాటలకు ప్రాణము విసిగి చావగోరినట్లుగా యోబు చావగోరలేదు గాని నేను చావను బ్రతికి దేవుని కార్యాలను వివరింతును అన్నట్లుగా ఉండెను. దేవుని కృపనుబట్టి యోబు భార్య తన భర్త గద్దింపును తీసికొనెను. కనుక మరలా పదిమంది బిడ్డలను సంపాదించు కొనెను. పోగొట్టుకున్న సకల సంపదలు రెండంతల ఆశీర్వాదంగా పొందెను.

ఈ వర్తమానం చదువుచున్న బిడ్డలారా మీ కుటుంబంలో వస్తున్న శోధనలను ఎదుర్కొన గలుగుచున్నావా? సర్వకృపానిధి యును దేవుడు కొంచెంకాలం మీరు శ్రమపడిన పిమ్మట తానే మిమ్మును పూర్ణులనుగా చేసి స్థిరపరచి బలపరచును అని నమ్మి శోధనలో శ్రమలలో దేవుని విడువక ఉండినచో దేవుడు మిమ్మును దీవించును.

# నిబంధన రక్తం

రాజమందిరంలో పెరిగినవారు, రాజవంశీకులతోనే స్నేహ బాంధవ్యాలు కోరుకుంటారేగాని సామంతులతో, సాధారణ పౌరులతో స్నేహం చేయాలనే ఊహే వారికి రాదు. కానీ 'యోనాతాను' రాజకుమారుడై యుండి గొఱ్ఱెల కాపరియైన 'దావీదు' స్నేహాన్ని ఆకాంక్షించాడు. రాజకుమారునిగా తనకున్న గుర్తింపుకంటే 'దావీదు స్నేహితుని'గా పిలువబడుటకు ఇష్టపడ్డాడు! తన తండ్రియైన 'సౌలు రాజు' ఎదుట యుద్ధములో జయింప శక్యము కాని భీకర యోధుడైన 'గొల్యాతు' నుద్దేశించి నిర్భయంగా దావీదు మాటలాడిన మాటల్లో ఉప్పొంగే రాజసాన్ని, పరవళ్ళు త్రొక్కే వీరత్వాన్ని చెవులారా విన్నాడు.

"రాజా! అడవిలో 'నా తండ్రి గొఱ్ఱెల'ను నేను కాయుచుండగా ఒకసారి సింహము, మరియొకసారి ఎలుగుబంటియు వచ్చి మందలోనుండి ఒక గొఱ్ఱెపిల్లను నోట కరచుకొని పారిపోవుచుండగా వాటిని తరిమి, వాటిని ఈ చేతులతో సంహరించి ఆ గొఱ్ఱెపిల్లను ప్రాణముతో రక్షించాను! రోషముగల దేవుని సైన్యమును హేళనచేసి, తిరస్కరించిన సున్నతిలేని (దేవుని ఎరుగని) ఆ ఫిలిష్తీయుడు,ఆ గొల్యాతు జీవముగల దేవుని చేతిలో మరణించక తప్పదు. మహోన్నతుడైన దేవుని కాపుదల ముందు ఈ కరవాలములు, ఈ కవచములు, ఈ శిరస్త్రాణములు కాలిపోయిన కట్టెలే! 'యుద్ధము యెహోవాదే!' క్రూరమృగము బారినుండి నన్ను రక్షించిన ఆ దేవుడే కౄరుడైన ఈ గొల్యాతు బారి నుండి నన్నూ, మీ రాజ్యమును రక్షించును గాక!"– అని అనిన బాలుడైన ఆ దావీదు మాటల్లో నిశ్చయమైన విజయం ప్రతిధ్వనించింది.

గొల్యాతుకు ఎదురుగా నిలబడటమంటే మరణం ముందు మోకరిల్లడమే!ఇక గొల్యాతును ఎదిరించడమంటే మరణాన్ని కౌగలించుకోవడమే! మరి, గొల్యాతును సంహరించటమంటే...! ఆ భీకర దృశ్యాన్ని ఊహించుకొంటేనే ఊపిరిపోతుంది! అటువంటి భయానక పోరులో గొల్యాతును సంహరించేందుకు యుద్ధోపకరణములేవి లేకుండానే ఒంటరిగా సిద్ధమయ్యాడు దావీదు! అతని అకుంఠిత ధైర్యానికి ఆశ్చర్యపోయాడు యోనాతాను! వడిసెలయే ఆయుధంగా యుద్ధభూమికి లంఘించాడు దావీదు.

ఆ సందర్భంలో, 'దావీదు సుందరుడే గాక, ఆత్మ సౌందర్యముగల అరవీరభయంకరునిగా, విధేయుడేగాక స్వాస్థ్యమును సంరక్షించగల సమర్థునిగా, దేవునికి విశ్వాస పాత్రుడేగాక ఆ దేవుని నామాన్ని ఘనపరిచే ఆత్మ సమర్పికునిగా, ప్రజా సంరక్షణకై ప్రాణాన్ని సహితం పణంగా పెట్టే త్యాగమూర్తిగా, ప్రేమామయునిగా యోనాతానుకు దర్శన మిచ్చాడు దావీదు.' ఒకే ఒక్క వడిసెల రాయితో రణయోధుడైన గొల్యాతు నేల కొరిగాడు! శత్రు సైన్యం పలాయనం చిత్తగించింది. ఖండించిన గొల్యాతు తలను చేతితో పట్టుకొని వస్తున్న దావీదుకెదురెళ్ళి హృదయ పూర్వకముగా ఆలింగనం చేసి అభినందన తెలిపాడు యోనాతాను. యిరువురి హృదయాలు ఒకదానితో ఒకటి మూగగా మాట్లాడుకున్నాయి.

"మిత్రమా! విమోచించావు రక్షించావు" – కృతజ్ఞతతో ఒక హృదయం స్పందించింది.

"స్నేహమా! విశ్వసిస్తే దేవుడు విజయమిస్తాడు" – కొనియాడుతూ మరో హృదయం పలికింది.

అప్రయత్నంగా ఒకరి కళ్ళు ఒకరిని చూచుకున్నాయి. ఆ చూపుల్లో స్నేహం ఉదయించింది. 'ఒక మంచి కాపరిగా, ఒక రక్షకునిగా దర్శనమిచ్చిన దావీదుతో ''నిజ స్నేహితుని''గా నిబంధన చేసికోవాలనుకున్నాడు యోనాతాను.

'ఏలా లోయ'లో సూర్యుడు అస్తమించబోతున్నాడు. ఆ లోయలో 'నిబంధన గుడారము' వేయబడి వుంది. ఆ గుడారములో రాకుమారుడైన యోనాతాను, గొఱ్ఱె

కాపరియైన దావీదు నిలబడి వున్నారు. వారి మధ్య ఎర్రటి తివాచీ పరచి వుంది. ఆ తివాచీ మీద 'యోనాతాను విల్లు' వుంది. తన నడుముకు కట్టివున్న ఖడ్గాన్ని ఒరలో నుండి తీసి దావీదు చేతికిచ్చాడు యోనాతాను. ఆ కత్తితో యోనాతాను కుడి అరచేతిని గాయం చేశాడు దావీదు. గాయమైన ఆ చేతితో కత్తిని అందుకొనిన యోనాతాను దావీదు కుడి అరచేతిని గాయం చేసి, ఆ కత్తిని విల్లుపై పెట్టాడు. రక్తము స్రవిస్తున్న యిద్దరి చేతులను చాలనం చేసి, యోనాతానిచ్చిన నడికట్టుతో ఆ రెండు చేతులను కలిపి కట్టాడు దావీదు. ఆ బంధించిన రెండు కుడిచేతులతో యెహోవా సింహాసనమైన ఆకాశమునకు ప్రణమిల్లి, “మన హస్తములను బంధించిన ఈ నడికట్టు సాక్షిగా, మమేకమైపోయిన మన రుధిరానికి లేదు వర్ణ బేధం మన రక్తము నొడిసి పట్టిన ఈ తివాచీకి లేదు వర్ణ బేధం రక్త మోడ్చిన ఈ ఖడ్గమైనా ఖండించ లేదు ఈ స్నేహ బంధాన్ని రక్తసిక్తమైన ఈ విల్లైనా విడదీయ లేదు మన అనుబంధాన్ని పరము చేరు వరకు పదిలం. మన ఈ 'రక్త నిబంధన” అని ఒకరినొకరు ఆప్యాయంగా ముద్దు పెట్టుకున్నారు.

ఈ లోకంలో ఒకరికొకరు వాగ్దానం చేసికుంటారు. ప్రమాణాలు చేసికుంటారు. పత్రాలు వ్రాసుకుంటారు. ఒట్టు పెట్టుకుంటారు, మాటిస్తారు. యివన్నీ కాలం చేసే మాయా జాలంలో విచ్ఛిన్నమైపోతాయి. కానీ, యోనాతానును దావీదును ముడి వేసిన ఈనిబంధన మాత్రం సత్యమైనది, నిత్యమైనది. సమాధానకరమైనది, మార్పు లేనిది. తరతరములకు రద్దుపరచలేనిది! విమోచించేది. రక్షించేది! చరిత్రలో చిరస్థాయిగా గోచరించేది! (1దిన16:19, కీర్తన 89:34, ఆది 9:16, సమూ.18:15) గొల్యాతు సంహరించబడిన తర్వాత, ఇశ్రాయేలీయులకు రాజుగా దావీదు సింహాసనాన్ని అధిష్టించాడు. రాజ్య విస్తరణ కోసం, ప్రజల సంరక్షణ కోసం శత్రు రాజులతో అనేక యుద్ధాలు చేశాడు. కాలగమనంలో యోనాతాను, అతని తండ్రి సౌలు రాజు, అతని యిద్దరు సహోదరులు యుద్ధమందు మరణించగా వారి రాజ్యము శత్రువు వశమై పోయింది. ఆ వార్త విన్న దావీదు, తన స్నేహితుని ఎడబాటును మరణయాతనగా అనుభవించాడు. అనేక దినములు అంగలార్చుతూ దుఃఖించాడు. తన ఆవేదనంతటిని ఒక ధనుర్గీతముగా రచించి. ఆలపిస్తూ ఉపశమనం పొందాడు. మరణించిన ప్రాణ స్నేహితుని వంశములో శేషించిన వారసుడు ఎవరైనా వున్నాడేమోనని విచారణ చేశాడు. 'తమ నిబంధన'ను ఆ వారసునితోనైనా కొనసాగించాలని ఆకాంక్షించాడు. ఎట్టకేలకు దావీదు అన్వేషణ ఫలించింది. 'లోదేబారు' అనే ఊరిలో 'మాకీరు' అను వాని యింట యోనాతాను కుమారుడైన 'మెఫీబోషెతు' జీవించి యున్నాడని, సౌలురాజు వంశాభిమానియైన 'సీబా' ద్వారా తెలిసికున్నాడు. అతడు రెండు కాళ్ళు లేని వికలాంగుడనని, దీనస్థితిలో ఉన్నాడని తెలిసికొనిన దావీదు మహారాజు వెంటనే అతనిని తన అంతఃపురానికి రప్పించాడు. దావీదుని దర్శించిన మెఫీబోషెతు 'తన పితామహుడు సౌలురాజు దావీదు యెడల చేసిన హత్యా ప్రయత్నములకు ప్రతీకారంగా తనకు అపకారం చేస్తాడేమోనని భయాక్రాంతుడై దేకుతూ వణకుతూ సాగిల పడ్డాడు. మెఫీబోషెతు హృదయ ఆలోచనను గ్రహించిన దావీదు,

“మెఫీబోషెతూ! నాకుమారా!”అని ప్రేమగా పిలిచాడు. ఆ పిలుపులో అభయముంది, అనురాగముంది. అది విన్న మెఫీబోషెతు, భయము వీడి “చిత్తము, నీ దాసుడను” అంటూ దావీదు పాదాలను వీక్షించాడు. దావీదు సింహాసనము దిగి, “మెఫీబోషెతు! భయపడకుము. నీవు కోల్పోయిన వారసత్వాన్ని, పూర్వపు మీ వైభవాన్ని నా స్నేహితుడును నీ తండ్రియైన యోనాతాను నిమిత్తము, నీ పితామహుడైన సౌలు రాజ్యమును మరల నీకు బహుకరించెదను'' అంటూ వాత్సల్యముతో అతనిని హత్తుకున్నాడు.

దావీదు దయాగుణానికి మెఫీబోషెతు ఎద ద్రవించగా, “చచ్చిన కుక్కవంటి వాడను. నీ దయా దాతృత్వమునకు పాత్రుడను కాను” అంటూ కన్నీటితో దావీదు హృదయాన్ని తడిపి వేశాడు.

**...మిగతా 15వ పేజీలో**

సాక్ష్యము

# ప్రభురెడ్డి

ఒంగోలు పట్టణం సివారులో ఉన్న జాషువా కాలనీలో ఇద్దరు స్నేహితులు ఉన్నారు. వారిపేర్లు నారాయణ మరియు ప్రభు. నారాయణ బేల్దారి మేస్త్రి. ప్రభు కూరగాయలు వ్యాపారం. ఇద్దరు ఒకే కాలనీలో ఉంటు జీవనము సాగిస్తున్నారు. అయితే ప్రభు రెడ్డి కులానికి చెందిన వ్యక్తి. ఇతడు కొన్ని నెలలుగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడు చున్నాడు. కుటుంబీకులు మరియు ఇతర వ్యక్తులు కలసి ఇతనిని ఒంగోలు రిమ్స్ హాస్పిటల్‌లో జాయిన్ చేశారు. కొన్ని రోజుల ట్రీట్‌మెంట్ తరువాత డాక్టర్లు ఇక లాభం లేదని గుంటూరు తీసుకొని వెళ్ళండి అని చెప్పారు. కుటుంబ స్తులు డబ్బులు పోగు చేసుకొని గుంటూరులో ఉన్న యన్.ఆర్.ఐ హాస్పిటల్‌కి తీసుకొని వెళ్ళారు. అక్కడ కూడ కొన్నిరోజులు ట్రీట్‌మెంటు తీసుకున్న తరువాత డాక్టర్లు ఇక లాభం లేదు ఇతడు చనిపోతాడు. ఎన్ని మందులు వాడిన ఇక ఉపయోగం ఉండదు కనుక ఇతనిని ఇంటికి తీసుకొని వెళ్ళండి అని చెప్పారు. అప్పుడు చేసేది ఏమి లేక అతనిని ఇంటికి తీసుకొని వచ్చారు. మరల కొన్ని దినముల తరువాత ఎలాగైనా ఇతనిని బ్రతికించుకోవాలని కుటుంబస్తులు మద్రాసులో ఉన్న పెద్ద హాస్పిటల్‌కి తీసుకొని వెళ్ళి చేర్పించడం జరిగింది. అయితే వీరికి అక్కడ కూడ నిరాశే మిగిలింది. యౌవ్వనస్థుడైన 'ప్రభు' దేహం పూర్తిగా క్షీణించి పోయింది. అవయవాలు పనిచేయడం ఆగిపోయినాయి. శ్వాస తీసుకోవడం కూడ కష్టమయింది. మనిషి చూచుటకు జీవములేని శవముగా మారిపోయాడు. అప్పుడు డాక్టర్లు ఇక ఇతడు చనిపోయినట్లే వాడుతున్న మందులకు ఇతని దేహము స్పందించడము లేదు. ఇక ఇతడు చనిపోయినట్లే శ్వాస పీల్చుకోవడం అతి కష్టముగా ఉన్నది. కనుక ఇతనిని మార్చూరి గది (శవాలు భద్రపరుచు గది)లో పెట్టవలసి ఉన్నదని చెప్పారు. ఈ వార్త విన్న కుటుంబీకులు ఎంతో క్రుంగిపోయి, కుమిలిపోయి చేసేది ఏమిలేక కొన ఊపిరితో ఉన్న ప్రభుని ఒంగోలు జాషువా కాలనీలో ఉన్న తన స్వగృహానికి తీసుకొని వచ్చారు. డాక్టర్లు చివరిగా చెప్పిన మాట ఏమిటంటే ప్రభుకి ప్రాణాంతకరమైన వ్యాధి సోకిందని తెలియజేశారు. ఒంగోలు తీసుకొని వచ్చిన తరువాత అతని స్నేహితులు, బంధువులు చివరి చూపుకొరకు అతని యొద్దకు వచ్చుచున్నారు. కుటుంబస్థులు అతను బ్రతకడని తులసి నీరు తీసుకొని వచ్చి నోటిలో పోశారు. అయితే కొన ఊపిరితో ఉన్న ప్రభు ఆ నీరు మింగలేక ఊసివేశాడు. కుటుంబస్తులు దండలు, ఫ్లెక్సీ భూస్థాపన కొరకు సిద్ధం చేస్తున్నారు. ఎంతో డబ్బులు ఖర్చుపెట్టారు. కొన్ని నెలలు హాస్పిటల్‌లో చూపిం చారు. అయినా లాభం లేక అందరు దుఃఖములో మునిగి పోయారు. ముందు చెప్పిన విధంగా నారాయణ ప్రభురెడ్డి ఇద్దరు మంచి స్నేహితులు. నారాయణ మేస్త్రి పాస్టరుగారికి ఈ విధంగా చెప్పాడు. అయ్యా ! మీరు నాతో వచ్చి చావు బ్రతుకుల్లో ఉన్న నా స్నేహితుని కొరకు మీరు ప్రార్ధన చేయాలి. మీ ప్రార్ధన దేవుడు ఆలకించి నా స్నేహితుని స్వస్థపరుస్తాడు దయచేసి మా కాలనీకి వచ్చి నా స్నేహితుని కొరకు ప్రార్ధించమని జాషువా కాలనీకి రమ్మని ఫోనులో వేడుకున్నాడు. అప్పుడు పాస్టరుగారు అతని గురించి 'ప్రభువా! ఈ కాలనీ వాసులు కుటుంబస్థులు మరియు స్నేహితులు ప్రభురెడ్డి స్వస్థత కొరకు నీవైపునకు చూస్తున్నారు. అతని స్వస్థపరచు తండ్రి అని ప్రార్ధించాడు. యేసు ప్రభువు చావు బ్రతుకుల్లో ఉండి, మరణకరమైన ఈ యౌవ్వనస్థుడిని స్వస్థపరు స్తాడని పాస్టరుగారికి గట్టిగా విశ్వాసము కలిగింది. అయితే నారాయణ మేస్త్రి యేసుప్రభువుని ఇంకా పూర్తిగా నమ్ము కోలేదు. ఈయనకు కూడ అనేక వ్యసనాలు ఉన్నాయి. మరియు ఉద్యమాలలో పాల్గొంటు ఉంటాడు. వృత్తిరీత్య బేల్దార్ మేస్త్రి. అయితే ఇతని విశ్వాసము గొప్పది. ఇతడు యేసుని గట్టిగా నమ్మాడు. యేసుప్రభువు తన స్నేహితుని స్వస్థపరుస్తాడని. ఆ రోజు పాస్టరుగారు మరికొందరు సహోదరులు కలిసి ప్రభు ఇంటికి వెళ్ళారు. నారాయణ మేస్త్రి వారికి ఎదురుపడి వారిని ప్రభు ఇంటికి తీసుకొని వెళ్ళాడు. అప్పటికే అక్కడికి దాదాపు 50మంది ప్రార్ధనకు వచ్చి

ఉన్నారు. ఒక పెద్ద టెంటు, కుర్చీలు, లైటింగ్ మరియు మైక్ సిస్టమ్ అంతా ఏర్పాటుచేసి ఉన్నారు. ఇరుగుపొరుగు వారు, కాలనీ వాసులు అందరూ ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు ఏమి జరుగుతుందో అని. అదే సమయములో ప్రభురెడ్డి ఇంటి బయట మంచము మీద స్పృహలేని స్థితిలో పడి ఉన్నాడు. అప్పుడు పాస్టరుగారు లూకా సువార్త 7వ అధ్యాయంలో ఉన్న ఒక కథ చెప్పాడు. 'నాయీను గవిని' దగ్గర యేసు ప్రభువు విధవరాలి యొక్క ఏకైక కుమారుడ్ని స్వస్థపరచుట. యేసు ప్రభువు గవిని దగ్గర పాడిని ముట్టినపుడు చనిపోయిన యౌవ్వనస్థుడు బ్రతికించబడ్డాడు. అందరు వాక్యము చాలా శ్రద్ధగా విన్నారు. అదే సమయంలో వారందరిలో ఒకటే ప్రశ్న 'ప్రభురెడ్డి బ్రతుకుతాడా', యేసు ప్రభువు స్వస్థపరుస్తాడా'! పాస్టరుగారు, వారితోటి సహోదరులు కలిసి ఇంటిలోనికి వెళ్ళారు. అక్కడ మంచము మీద ప్రభురెడ్డి పడుకొని ఉన్నాడు. ఇంటి వారందరూ ఏడుస్తూ ఉన్నారు. ప్రభురెడ్డి అక్క విశ్వాసి ఆమెతో పాస్టరుగారు కొబ్బరి నూనె ఉందా అని! వెంటనే కొబ్బరి నూనె తెచ్చి పాస్టరుగారి చేతిలో పెట్టింది. పాస్టరుగారు ప్రార్థించి మూడు చుక్కలు ప్రభురెడ్డి నోటిలో వేశాడు. ప్రభురెడ్డి తన పాపములు యేసు సన్నిధిలో ఒప్పుకున్నాడు. యేసు ప్రభువా నన్ను మన్నించుమని వేడుకున్నాడు. పాస్టరుగారు చెయిపెట్టి అతనిని ముట్టి వేడుకున్నాడు. వారితో కలసి ఉన్న సహోదరులు అందరు వేడుకున్నారు. పాస్టరుగారు వారియొక్క అమ్మతో 'అమ్మా! మీ కుమారుడు బ్రతుకుతాడు. నిశ్చయంగా ఉండండి' అని చిప్పి చివరిగా ప్రార్థించి వెళ్ళారు.

ఇట్లుండగా మూడు రోజులు తర్వాత పాస్టరుగారి ఆఫీస్‌కి నారాయణ మేస్త్రి వచ్చి ఇలా అన్నాడు యేసుప్రభువు చాలా గొప్పవాడు. ఆయనే నిజమైన దేవుడు. ఆయనలో మహిమ ఉన్నది. దయచేసి నాకు బాప్తిస్మము ఇవ్వండి. నేను ప్రభువుని నమ్మకుంటున్నాను. ఈ మాట వినగానే పాస్టరు గారికి చాలా సంతోషము కలిగింది. అప్పుడు ఆయన నారాయణ మేస్త్రిని 'ఇంత అకస్మాత్తుగా నిర్ణయం తీసుకో వడానికిగల కారణం ఏమిటి?' అని అడిగాడు అప్పుడు అతడు 'అయ్యా! నా విన్నపము మన్నించి నా దగ్గరకు వచ్చి ప్రభురెడ్డికి ప్రార్ధన చేసారు. యేసుప్రభువు చాలా గొప్పవాడు. నా స్నేహితుడు బ్రతికాడు. యేసుప్రభువు బ్రతికించాడు. కనుక నేను కూడ ఆయనను నమ్ముకుంటున్నాను' అని చెప్పాడు. ఈ వార్త వినగానే పాస్టరుగారు ఎంతో సంతోషించారు. అన్ని నామముల కంటే ఘనమైనది యేసయ్య నామము. ఆ నామ ములోనే రక్షణ, స్వస్థత కలదు. రెండు రోజుల తరువాత కొత్త పట్నంలో ఉన్న సముద్రంలో నారాయణ మేస్త్రికి బాప్తిస్మము ఇవ్వడం జరిగింది. ఇప్పుడు ప్రతి ఆదివారం తన స్నేహితుడైన ప్రభురెడ్డిని తీసుకొని ఆరాధనకు వెళ్తున్నాడు. ఎంతగొప్ప సాక్ష్యమో కదా! నారాయణ విశ్వాసమే ప్రభురెడ్డిని స్వస్థపరి చింది. ఇప్పుడు ప్రభురెడ్డి జీవితమే ఒక సజీవ సాక్ష్యము. ప్రియ స్నేహితులారా! యేసు ప్రభువు ఎంతైనా నమ్మదగిన వాడు. ఆయనకు అసాధ్యమైనది ఏదియు లేదు. "నీవు నమ్మి ఆయన మహిమను చూచెదవు". "యేసు ప్రభువు నామమునకే మహిమ, ఘనత ప్రభావములు యుగయుగములు చెల్లును గాక" ఆమెన్. "దేవుడు మిమ్ములను దీవించును గాక".

## పాఠకులకు గమనిక

**'హన్నాకృప'** పత్రిక కావాలని అనేకమంది ఉత్తరాల ద్వారా, ఫోన్స్ ద్వారా అడుగుతున్నారు. "మీ పత్రిక ఫలానా చోట చూశాము. మా అధ్యాత్మిక జీవితానికి ఎంతో మేలు కరంగా ఉంది. దయచేసి మాకు కూడా పంపండి. మేము చందా కడతాము" అని అడుగుతున్నారు. అలా అడిగిన వాళ్ళందరికీ పంపాలంటే ఇప్పుడు చందా కట్టకుండా ఉచితంగా పత్రిక పొందుతున్న వాళ్ళందరికీ ఆపాలి. నేటి పరిస్థితులలో పత్రిక నిర్వహణ చాలా వ్యయప్రయాసలతో కూడుకొని ఉన్నప్పటికీ, కేవలం విశ్వాసము ద్వారానే ఈ పత్రిక నడుపగలుగుతున్నాము. అయితే పాఠకులు చందా కట్టడం తమ బాధ్యతగా గుర్తించాలి. ఎందుకంటే మీరు చందా కట్టటం వలన ఇంకా అనేకమందికి పత్రిక పంపడానికి సాధ్యమవుతుంది. సంవత్సరమంతటికీ కలిపి కేవలం 350/– రూపాయలు అన్నది ఎన్నతగినది కాదు. కావున పాఠకులు సహృదయంతో ఆలోచించి చందా కట్టవలసినగా ప్రభువు పేరట వేడుకొనుచున్నాను.

**– ఎడిటర్**

# నిన్నటి దినము

సూర్యుడు అస్తమిస్తే క్రొత్త రోజు మొదలవుతుంది. అది బైబిలు లెక్క. అస్తమయము కలుగగా ఒక దినమాయెను. అస్తమయము ఈ రోజును నిన్నటి దినముగా మారుస్తుంది. మనము నిన్నటి వారమే. ఈ రోజు బ్రతికి ఉన్నాము. అంటే నిన్నటి దిన జ్ఞాపకాలతో జీవిస్తాము. నిన్నటి దిన జ్ఞాపకాలు మనల్ని వెంటాడుతూ ఉంటాయి. అవి మన రేపును కూడా వెంబడిస్తాయి. చేదు అయనా తీపి అయినా మంచి అయినా చెడు అయినా మన ఈ దినములో పని చేస్తుంటాయి. మనం వాటిని తప్పించుకో లేము. ఒకవేళ నిన్నటి దినము మన జ్ఞాపకములు లేకుండే స్థితికి మనం వస్తే మనల్ని పిచ్చివాళ్ళు అంటారు. కాలం గడిచే కొలది నిన్నటి దినాన్ని కొంత మాత్రమే మనం మరచిపోతాము.

యేసుప్రభువు తన ప్రసంగాలలో రేపటిని గూర్చి చింతించవద్దు అన్నాడు. ఆలోచింపవద్దు అనలేదు. ప్లాను చేయవద్దు అనలేదు. ఆయన ప్రసంగాలలో పాత నిబంధన లోని ఎన్నో దినాలను గురించి జ్ఞాపకము ఉంచుకున్నాడు. నిన్నటి దినాలు అవి మనకిచ్చిన పాఠాలు చాలావరకు మన జీవితాల్ని నడిపిస్తాయి. దేవునికి వేయి సంవత్సరాలు నిన్నటి దినమువలె ఉన్నవి. అంటే ఆదాము ఆరు రోజుల క్రితము వాడు. అబ్రాహాము నాలుగు రోజుల క్రిందటి వాడు. దావీదు మూడు రోజుల క్రిందటివాడు. పౌలు, పేతురు, యోహాను రెండు రోజుల క్రిందటి వారు. ఆది క్రైస్తవులు అందరూ ఒకరోజు క్రిందటివారు. అవి మనము భావిస్తే మనము వారికంటే దగ్గరలో ఉన్నామా అనిపిస్తుంది. అనిపించటం కాదు అది నిజము కూడా.

ఆదాము నుండి హతసాక్షి అయిన్ స్టెయిన్ వరకు ఒక కాల కొలతబద్ద పెట్టి – పైవిధముగా విభాగిస్తే వారందరూ మనతోటి వారు మన తరం వారు అని, వారి జీవితాలకి హృదయాలకి దేవునితో వారి సంబంధాలు ఎడబాటు అయిన దినములు మనకు ఎంతో కనువిప్పు కలిగించి నేటి దినమున మన జీవితాలు దేవునితో ఎట్టి సంబంధము కలిగిఉన్నాయో మనకు అర్థం అవుతుంది. ఎంతో సంతోషం కలుగుతుంది. అబ్రాహాము లోతు కొరకు గాజాడిన సంగతి, మోషే తనను కనాను దేశములోని రానిమ్మని బ్రతిమాలు తుంటే యెహోవా దేవుడు 'చాలును ఇక ఈ సంగతిని గూర్చి నాతో మాట్లాడ వద్దని' ఒక మనిషి ఇంకొక మనిషితో మాట్లాడినట్లు మాట్లాడడం ఇవన్నీ నిన్నటి దిన విశేషాలే. మనము నిన్నటి వారమే. మనకు ఏమి తెలియదు అంటే పూర్వము జరిగిన విషయాలు తెలియవు.

భూమి మీద మన దినములు నీడవలె ఉన్నవి. ఎంత వేగంగా పెరిగామో అంత వేగంగా తరిగిపోతున్నాము. అందుకే "మునుపటి తరమువారి సంగతులు విచారించుము, వారి పితరులు పరిశీలించిన దానిని బాగుగా తెలుసు కొనుము". వారు పరిశీలించారు. శ్రమించిన దానిని క్షుణ్ణంగా తెలిసికున్నారు. "వారు నీకు బోధించుదురు గదా. "దివా రాత్రము దానిని (బైబిలు) ధ్యానించువాడు ఆకువాడక తన కాలమందు ఫలమిచ్చు చెట్టువలెనే ఉండును". యేసు ఫలములు వెదక వచ్చినపుడు ఫలములు ఉంటాయి.

తరము వెంబడి తరము గతించిపోవును. ఎల్లప్పుడు భూమి మీద ఒక తరము ఉంటుంది. కాని అందు జీవించిన వారందరు మిగిలిన జీవరాసులవలెనే మరువ బడతారు. పితరులకు ప్రతిగా నీ కుమారులుందురు" భూమియందంతట నీవు వారిని అధికారులుగా నియమించెదవు. తరములన్నిటను నీ నామమును జ్ఞాపకముందునట్లు నేను చేయుదును" అని ప్రభువు వాగ్దానమిచ్చియున్నాడు.

మనుష్యులు – తరువాత తరమువారి వలన మరువబడ కూడదని ఎన్నో ఎన్నో కట్టడాలు కట్టించారు. శిలలు చెక్కించారు. కాని వారితో వారి క్రియలు కూడా నిన్నటి దినముననే మరువబడ్డాయి. మొదట మానవుడైన ఆదాము నుండి నేటి స్టెయిన్స్ వరకు మధ్యకాలములో దేవునితో ప్రతిదినము నడచిన వారిని నిన్నటి దినము అన్ని దినములలో మానవులు జ్ఞాపకం ఉంచుకునేలా దేవుడు దీవిస్తాడు. 'అంతట నేను క్రొత్త ఆకాశమును క్రొత్త భూమిని చూచితిని. ఆ పట్టణములో ప్రకాశించుటకై సూర్యుడైనను చంద్రుడైనను దానికక్కరలేదు. అక్కడ రాత్రి లేనందున అస్తమయమును ఉదయమును ఉండవు. నిన్నటి దినమనునది ఉండదు".

**11వ పేజీ తరువాయి...**

"మెఫీబోషెత్, నీ తండ్రి నేను చేసుకున్న నిబంధన రక్తం నిన్ను నా సన్నిధికి పాత్రునిగా చేస్తుంది. నేటి నుండి ఎల్లప్పుడు నా బల్ల యొద్దనే నీకు కూడా నీ భోజనము సిద్ధపరచి వుంటుంది." అంటూ ఓదార్చి, సీబా వైపు తిరిగి, "సౌలు రాజు సేవకుడా! సౌలునకును, అతని కుటుంబము నకును కలిగిన యావదాస్తిని, భూమి యావత్తును నేను నిబంధన చేసిన నీ యజమానుని కుమారుడైన మెఫీబో షెతుకు యిచ్చియున్నాను. ఆ ఆస్తికి సంరక్షకుడవై , అతని కొరకై ఆ భూమిని సాగు చేసి సంచకరుడవై వుండు" అంటూ ఆజ్ఞను జారీ చేశాడు దావీదు. నిస్సహాయుడు, నిరాదరణకు గురైనవాడు, దౌర్భాగ్యుడు, వెలివేయబడిన వాడు, ఎన్నికలేని వాడైన మెఫీషేబోతు "రక్త నిబంధన" ప్రకారము రాజకుమారులలో ఒకడై, రాజు బల్ల యొద్దనే భోజనము చేయుచుండెను (2 సమూ 4:4, 9:6-13, 16:1-4, 19:24-30, 21:7)

పరమందున్న యేసు మనతో కూడ తన బల్ల యొద్ద భోజనము చేయుటకు యిష్ట పడుతున్నాడు! ఈ లోకంలో ప్రయాసపడి పాపభారాన్ని మోస్తున్న ప్రతీ మానవునికి పాప విమోచన చేసి విశ్రాంతి నిస్తానని వాగ్దానం చేస్తున్నాడు (మత్తయి 11:28). మానవుడు ఈ భూమ్మీద వేదన-రోదనతో, ఆరాట-పోరాటాలతో, రోగ-రుగ్మతలతో, నిరాశ-నిస్పృహతో అనేక శోధనలతో, సమస్యలతో సర్వం కోల్పోయి మనుగడ సాగించడం మన ప్రభువైన యేసుకు యెంత మాత్రం యిష్టం లేదు. తన బిడ్డలు పాపబంధకాలలో బ్రతకడం అంతకంటే యిష్టం లేదు. మరణించి నరకాగ్నిలో జీవించడం అసలే యిష్టం లేదు. అందుకే తన 'సిలువ నిబంధన రక్తం' ద్వారా మానవాళికి విముక్తి ప్రసాదించాడు (మత్తయి 26:28)

నశించిపోతున్న మానవులను వెదకి రక్షించుట కొరకు తన అత్యున్నత సింహాసనాన్ని త్యజించి, అశాశ్వతమైన ఈ మర్త్యులను ఉద్ధరించాలని, జీవము నిండిన దేహంతో సిలువపై మరణించాడు యేసు! తన రక్త నిబంధన ద్వారా పాప క్షమాపణకు సోపానాలు వేశాడు. నిత్యజీవానికి మార్గాన్ని నిర్మించాడు. మరణం తర్వాత మనదైన మరో లోకం ఉందని మరణించి పునరుత్థానుడయ్యాడు! ఆ మరో లోకంలో ప్రవే శించాలన్నా, ఆ లోకంలో పరిశుద్ధులలో ఒకరై ప్రకాశిం చాలన్నా, ఆకలిదప్పులు లేని ఆయన సన్నిధిలో ఆనందిం చాలన్నా- యేసు తండ్రితో చేసిన రక్త నిబంధన ద్వారా సిలువ వేదికపై ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక విందును ఆత్మ పూర్ణులై ఆరగించాలి. ఆ సిలువ త్యాగాన్ని, ఆ కల్వరి ప్రేమను స్మరించాలి, స్తుతించాలి, విశ్వసించాలి, గౌరవించాలి.

"ఎవడైనను నా స్వరము విని తలుపు తీసిన యెడల నేను అతని యొద్దకు వచ్చి అతనితో నేనును, నాతో కూడ అతడును భోజనము చేసెదము. అతనిని నాతో కూడ నా సింహాసనముపై కూర్చుండ బెట్టెదను." అంటూ మన హృదయ తలుపులు తట్టుచున్నాడు. మన హృదయ ద్వారము యొద్ద నిలబడి వున్న యేసుని ఆహ్వానించండి, ఆ నిబంధన రక్తాన్ని ఆస్వాదించండి (ప్రకటన 3:20).

యేసు ఆ పాత్రను పైకెత్తి, "ఈ పాత్ర నా రక్తము వలననైన క్రొత్త నిబంధన. దీనిలోనిది త్రాగునప్పుడెల్ల నన్ను జ్ఞాపకము చేసికొనుటకై దీనిని చేయుడి" అని మనలను కోరుతున్నాడు. ఆ పాత్రలోని నిబంధన రక్తము ప్రతీ పాపము నుండి మనలను పవిత్రులుగా చేస్తుంది. సిలువ సింహాసన ముపై ప్రోక్షించిన ఆ నిబంధన రక్తము మనం కోల్పోయిన ఆయన సన్నిధిని పునఃప్రసాదిస్తుంది.(1 కోరిం.11:25) ఆ నిబంధన రక్తము మనలనందరిని విమోచించి యేసు సన్నిధికి చేర్చును గాక! ఆమెన్.

ఇంటర్నెట్‌లో "తెలుగు బైబిల్" కొరకు ఈ క్రింది వెబ్‌సైట్ సందర్శించండి

**www.onlinetelugubible.net**

చిన్నపిల్లల పేజి

# వివేకముగల రాజు

చాలా కాలం క్రితం ఒక చాలా చాలా జ్ఞానంగల రాజు ఉండేవాడు. ఆ రాజుకి ఎంత జ్ఞానం ఉందంటే అతను ఏ విషయమైన తెలుసుకోగలడు. అతనికి పక్షుల గురించి, జంతువుల గూర్చి చేపల గూర్చి అలాగే చెట్లను గూర్చి కూడా తెలుసు. ఈ రాజు వీటన్నిటి గూర్చి రాజ్యంలోని ప్రజలందరికి తెలియజేస్తుంటాడు.

ఒకసారి ఒక చల్లగాలి వీచేవేళ ఒక చిన్న తేనెటీగ దారి తప్పి ఆ అందమైన రాజభవనంలోనికి ప్రవేశించింది. అప్పుడు ఆ తేనెటీగ రాజుగారిని బతిమాలుకుంటుంది. రాజుగారు నన్ను ఏమి చేయవద్దు. నన్ను ఈ రోజు బ్రతకనియ్యండి అప్పుడు తరువాత మీకు ఎప్పుడైన సహాయం కావాలంటే నేను మీకు సహాయం చేస్తాను.

అప్పుడు ఆ రాజుకి నవ్వు వచ్చింది ఇంత చిన్న తేనెటీగ ఇంత గొప్ప రాజునైన నాకు సహాయం చేస్తుందా. ఆ రాజు ఆ తేనెటీగను వదిలేసి "వెళ్లిపో నాకు ఈ రోజుకు నీ నుండి ఎలాంటి అవసరం లేదు". అన్నాడు.

చాలా రోజుల తరువాత ఒకరోజు రాజభవనం అంతా జనంతో నిండిపోయింది. ఎందుకంటే చాలా దూరం నుండి ఒక రాణి రాబోతుంది అందుకు. ఆమె ఈ రాజుగారి యొక్క జ్ఞానం గూర్చి అందరు చెప్పుకోవటం వినింది. ఇప్పుడు తనంతట తానుగా తెలుసుకోవాలని వస్తుంది. చివరికి ఆమె రాజుగారి సింహాసనం దగ్గరికి వచ్చింది. వచ్చిన వెంటనే రాజుకి కానుకలు అందించి తను ఎందు కొచ్చిందో ఆ కారణం తెలియజేసింది.

నేను విన్నాను మీరు మిగిలిన రాజులకంటే ఈ భూలోకంలో ఉన్న ప్రజలకంటే ఎంతో తెలివైనవారని మీరు మీ తెలివికి కొన్ని పరీక్షలు పెట్టటానికి ఒప్పుకుంటారా.

ఆ పరీక్షలకి రాజుగారు ఒప్పుకున్నారు. అప్పుడు ఆ రాణి తను చేయగలిగినదాంట్లో కఠినమైన ప్రశ్నలు, చమత్కారమైన, అలాగే కష్టమైన పరీక్షలు పెట్టాలి అని అనుకుంది. ఆమె రాజుగారిని బాగా విసికించటం మొదలు పెట్టింది.

ఒకరోజు ఆ రాణి రాజుగారికి ఒక పెద్ద రత్నం ఇచ్చింది. దానికి మధ్యలో మెలితిరిగి ఉన్న ఒక రంధ్రం ఉంది. నువ్వు రంధ్రంలో నుంచి దారాన్ని పోనీయగలవా అని రాజుగారికి ఒక సవాలు విసిరింది. అప్పుడు ఆ రాజు ఒక పట్టుపురుగును ఆ రంధ్రంలోకి పోనిచ్చి త్రాడు తయారు చేయమన్నాడు. ఆ పట్టుపురుగుకి అదేమి అంత కష్టం కాదు. అది ఒక సన్నని దారం ఆ రంధ్రంలో తయారు చేసింది.

మరొకసారి ఆ రాణి అతనిని పరీక్షించటానికి ఒక గదిలో యాభైమంది అబ్బాయిలను అలాగే యాభైమంది అమ్మాయిలను ఉంచింది. వాళ్ళందరు ఒకే విధంగా తయారయ్యారు. ఎలాగంటే ఎవరు అమ్మాయో ఎవరు అబ్బాయో గుర్తుపట్టలేనట్లు. చూడు నువ్వు వీళ్లలో నుంచి అబ్బాయిలను వేరు చేయినేను నువ్వు జ్ఞానముగలవాడవని నమ్ము తాను అన్నది.

కాని ఆ రాజుకి తెలుసు అతని ఎలా చెప్పగలడో. అతను తన దగ్గర పనిచేసే వారిని పిలిచి ఇక్కడ ఉన్న ప్రతి ఒక్కరికి ఒక గిన్నెలో నీరు తీసుకొని వచ్చి, అక్కడ ఉన్న వారందరికి ఇవ్వమన్నాడు. ఆ గదిలో ఉన్నవారందరు ఆ గిన్నెలను తీసుకొనిన తరువాత వాళ్ళందరిని ముఖం కడుకోమన్నాడు. అక్కడ ఉన్న అబ్బాయిలు అంత నీళ్ళను తుళ్లి మీద పదులాగా చేతులను నీళ్ళలో ముంచారు. కాని అమ్మాయిలు జాగ్రత్తగా వేళ్ళని నీళ్ళలో ముంచి ముఖం కడుకున్నారు. ఈ విధంగా రాజు ఎవరు అమ్మాయో ఎవరు అబ్బాయో చెప్పాడు.

ఆయన తెలివితేటలను చూసి రాణికి కోపం వచ్చింది. ఎలాగైనా ఈ రాజు వెర్రివాడు, జ్ఞానవంతుడు కాదు అని నిరూపించాలి అని దగ్గర ఉన్న సలహాదారులను అడిగింది.

అప్పుడు వాళ్ళకి ఒక ఆలోచన వచ్చింది. వాళ్ళు దానివల్ల కచ్చితంగా ఈసారి ఓడిపోరు. వాళ్ళు రాణితో మీరు కొంతమంది పనివారిని పిలిపించి వారిచేత ఒక తొంభై తొమ్మిది నకిలి పువ్వులను తయారుచేయించింది. అవి అచ్చం

నిజమైనవిలాగా ఉండాలి. అవన్ని తయారైన తరువాత రాణి కూడా చెప్పలేకపోయింది అవి నకిలి పువ్వులని. ఆ రాజు కూడ చెప్పలేడు అని అనుకుంది రాణి. ఆ రాజుగారి తోటలోనుండి ఒక పువ్వు తీసుకొని వాటిలో కలిపేసింది.

"రేపు ఒక అద్భుతమైన రోజు" అని రాణి అనుకుంది. ఎందుకంటే మనం ఆ తెలివైన రాజు వెర్రివాడిగా నిరూపించబోతున్నాము. రేపు జరగబోయే ఆ విందులో రాజు గారిని అడుగుతాను ఇందులో ఏది నిజమైన పువ్వోనని.

తరువాత రోజు అందరు రాజుగారిని ఘనపరచడానికి ఆయన విందుకి రాజ్యంలోని ప్రజలందరు వచ్చారు. అక్కడ విందు అయిపోయిన తరువాత రాణి నుంచ్చోని మాట్లాడటం మొదలుపెట్టింది. అందరు ఆమె చెప్పేది శ్రద్ధగా వినటం మొదలుపెట్టారు.

అందరు వినండి నేను అందరికి ఒకటి చెప్పాలి. ఈ రోజు నేను రాజుగారికి ఒక ఆఖరి పరీక్ష పెడతాను. నా పనివారు చాలా అందమైన పూలను తయారుచేసారు. అవన్ని చాలా నిజమైనవిగా ఉన్నాయి. అందులో తొంభైతొమ్మిది పువ్వులు నకిలివి ఒకటి మాత్రం నిజమైనది. రాజుగారు కనుక్కోగలడా నిజమైన పువ్వు ఏదో?

అప్పుడు ఆ రాజు ఆ రాణి ముందు వెర్రివాడు కాకుండా ఉండటానికి ఆ సవాలుని ఒప్పుకున్నాడు. అతను ఆ పువ్వులను వాసన చూసాడు అవన్ని ఒకే విధంగా మంచి వాసన కలిగివున్నాయి. అన్ని పువ్వులు ఎంతో మృదువుగా ఉన్నాయి. అన్ని అందంగా కూడా ఉన్నాయి. మరి ఇప్పుడు ఏది నిజమైన పువ్వు అని ఎలా కనుక్కోవాలి అని రాజు ఆలోచించడం మొదలుపెట్టాడు. రాజు సంకోచించాడు. అప్పుడు ప్రజలంతా ఏంటిది మన రాజు అందరికంటే తెలివైనవాడు అలాగే గొప్ప వాడు కాదా? కచ్చితంగా ఆయన చెప్పగలడు నిజమైన పువ్వు ఏదో.

రాజు కొంచెం కలవరపడ్డాడు. ఇప్పుడు నేను ఏమి చేయాలి అని. అప్పుడు అతనికి ఒక శబ్దం వినిపించింది. ఎంటి అది అని చూస్తే అది ఆ తేనెటీగ ఒకప్పుడు అతను దానిని కాపాడాడు. నేను ఇక్కడున్నాను మీకు సహాయం చేయటానికి రాజుగారు. మీరు ఆ రోజు నా మీద చూపించిన దయకు నేను ఈ రోజు మీకోసం ఏదైన సహాయం చేయటానికి వచ్చాను.

అప్పుడు తేనెటీగ ఆ పువ్వుల దగ్గరకు ఎగురుకుంటు వెళ్ళి కొద్దిసేపటిలోనే ఏదైతే స్వచ్ఛమైన తేనెతో తీయగా ఉన్నదో కనుక్కుంది. వెంటనే రాజు ఆ పువ్వుని తీసుకొని రాణికి ఇచ్చి దానిని చూడమన్నాడు. ఆ పువ్వుని ఆ పనివారు చూచి అవును ఇదే నిజమైన పువ్వు అని చెప్పారు. చివరికి రాణి తన ఓటమిని అంగీకరించి ఈ రాజు నిజంగా అందరికంటే జ్ఞానముగలవాడని అంగీకరించింది.

అవును అతను నిజంగానే చాలా వివేకముగలవాడు. అతను ఎవరో కాదు దావీదు కుమారుడైన సొలొమోను. సొలొమోను ఎప్పుడైతే దేవుని ప్రార్థించి ధనంకి బదులుగా జ్ఞానమును అడుగుతాడో అప్పుడు యెహోవా దేవుడు ఈ విధంగా చెప్పాడు...

"నీవు ఈలాగ అడిగినందుకు నీ మనవి ఆలకించు చున్నాను. బుద్ధి వివేకములుగల హృదయమును నీకిచ్చు చున్నాను. పూర్వికులలో నీవంటివాడు ఒకడును లేడు, ఇకమీదట నీవంటి వాడొకడును ఉండడు. మరియు నీవు ఘనతను ఇమన్ని అడుగకపోయినను నేను వాటిని కూడా నీకిచ్చుచున్నాను. అందువలన నీ దినములన్నిటను రాజులలో నీవంటివాడు ఉండడు". (1 రాజులు 3:12-13).

**యెహోవాకు కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి ఆయన నామమును ప్రకటన చేయుడి. జనములలో ఆయన కార్యములను తెలియచేయుడి. కీర్తనలు 105:1**

మీ జీవితాలలో దేవుడు చేసిన మేలులను ఇతరులకు తెలియపరచుట ద్వారా దేవుని నామానికి మహిమ కలగడమే కాక వినినవారు విశ్వాసంలో బలపడుటకు మీ సాక్ష్యము ఉపయోగపడవచ్చు. కావున మీ అమూల్యమైన సాక్ష్యాలు మాతో పంచుకొనిన యెడల వాటిని సంతోషంగా పత్రికా ముఖంగా ప్రచురించుటకు మేము సిద్ధంగా ఉన్నాము. దేవుని నామ ప్రకటనలో మాతో పాటు మీరు పాలి భాగస్తులు కావాలని ఆశిస్తున్నాము.

# కృపాదానం

మిలటరీ నుండి రిలీవ్ అయిన తర్వాత అయిదుగురు పిల్లలతో ఒంగోలు వచ్చి. తండ్రి ద్వారా సంక్రమించిన ఇంటిలో కాపురం పెట్టాడు. నాటి వడ్డెపాలెంలోని మహాలక్ష్మి ఆలయం ప్రక్కన తన తల్లిదండ్రులు ప్రారంభించిన ఎలిమెంటరి స్కూలులో తన అక్క, బావ పని చేస్తున్నందున సామర్లకోట రైల్వేస్టేషన్‌లో హిగ్గిన్ బాతమ్స్ బుక్ డిపోలో మేనేజర్‌గా పనిలో చేరాడు. ఒక సంవత్సరం పనిచేసిన తర్వాత మేనేజ్‌మెంట్ వారితో విభేదాలు వచ్చాయి. ప్రకాశం జిల్లా నుండి తూర్పు గోదావరిలో పనిచేయుటకు కుటుంబంతో సహా వెళ్ళిన కృపాదానం తరపున న్యాయం చెప్పటానికి సొంత వాళ్ళు, తన వాళ్ళంటూ ఎవరూ లేరు. తన భార్య హన్నమ్మ తన సొంత మేనత్త కుమార్తె. చిన్నప్పటి నుండి ప్రార్థన శక్తిలో ఎదిగినది. నాటి లూథరన్ మిషన్‌లో ముఖ్యమైన వారిలో ఒకడైన కూచిపూడి రాజారత్నంగారి ఏకైక చెల్లెలు. ఇప్పుడు వచ్చిన ఈ ఉద్యోగ సమస్యలను ఎదిరించి పోరాడి నిలబడాలా? లేక దేవుని మీద విశ్వాసంతో తగాదాలు మాని దేవునియందు నిలబడి ప్రార్థించాలా? అనే సందిగ్ధంలోనే భార్యతో కలిసి ప్రార్థించటం ప్రారంభించాడు. ఇటువంటి క్లిష్ట పరిస్థితులలో వారికి మరో కుమార్తె ఇవ్వ బడింది. విట్టికర్ గర్ల్స్ పాఠశాలలో తన ముగ్గురు పిల్లలు చదువుకునేవారు. వారి చదువుల నిమిత్తం స్కూలుకు దగ్గరలో ఉన్న ఆంజనేయ దేవాలయముకు చేరువలో కాపురం ఉండేవారు.

స్కూల్ మిషనరీ బంగళాలో కాపురమున్న దొరగారు కృపాదానంతో అమెరికాలో తన జీవితాన్ని గురించి మాట్లాడుతూ ఒక సందర్భములో **"నీవు బలిపీఠము మీద అర్పణము అర్పించుచుండగా నీ మీద నా సహోదరునికి విరోధమేమైన కలదని అక్కడ నీకు జ్ఞాపకము వచ్చిన యెడల అక్కడ బలిపీఠము ఎదుటనే నీ అర్పణము విడిచిపెట్టి మొదట వెళ్ళి నీ సహోదరునితో సమాధానము పడుము అటు తర్వాత వచ్చి నీ అర్పణము సమర్పించుము. నీ ప్రతివాదితో నీవును త్రోవలో ఉండగానే త్వరగా వారితో సమాధానపడుము"** అని చెప్పాడు.

ఆ తరువాత ఇంటికి వచ్చిన కృపాదానంతో ఆయన భార్య వచ్చి తను ప్రార్థించినప్పుడు ప్రభువు ఇచ్చిన మాట అని బైబిలును తెరచి మత్తయి సువార్తలోని అదే వాక్యమును చూపించింది.

ఉదయం ప్రార్థన చేసేటప్పుడు తనకు ప్రేరణ కలిగి దొరగారి దగ్గరకు వెళ్ళినప్పుడు ప్రభువు ఇచ్చిన మాట, భార్య ద్వారా దేవుడు బయలుపరచిన మాట ఒకటే కావడంతో మేనేజ్‌మెంట్ వారితో ఉన్న విభేదాల నిమిత్తం పోరాడక, ప్రభువునుబట్టి సమాధానంగా ఉద్యోగాన్ని వదిలివేసి ఆ ప్రాంతం నుండి వెళ్ళిపోవాలని నిశ్చయించుకున్నాడు. అర్థాంతరంగా ఉద్యోగం వదిలి కుటుంబముతో వెళ్ళిపోతున్న కృపాదానంను చూసి స్నేహితులు బాధపడ్డారు.

రెండు వారాల తర్వాత ఇంటి సామాను కోసం సామర్లకోట వచ్చిన కృపాదానం, తను వెళ్ళిన తర్వాత మేనేజ్‌మెంటు వారికి వచ్చిన అపాయకర పరిస్థితులను గురించి తెలుసుకొని, ప్రభువు అక్కడ నుండి తనను దూరంగా తీసుకెళ్ళి ఆ అపాయకరమైన పరిస్థితులలో నుండి తనను తప్పించిన విధానమును చూసి ఆశ్చర్యపోయాడు. ప్రభువు తన పట్ల చూపించిన ప్రత్యేకమైన కాపుదలకై కృతజ్ఞతతో తన జీవితాన్ని ప్రభువుసేవకై భార్య హన్నమ్మతో కలిసి సమర్పించుకున్నాడు.

తుని పట్టణం ప్రక్కనున్న కోటనందూరు మండలం భీమవరపుకోట గ్రామంలో స్కూలులో టీచరు పోస్టు ఖాళీగా ఉన్నదని తెలిసి. తన భార్యకు ఆ టీచర్‌పోస్ట్ వస్తే కొంత పరిస్థితి మెరుగుపడుతుంది అనే ఆశతో కుటుంబంతో భీమవరపుకోటలో కాపురం పెట్టాడు. మాలపల్లికి మాదిగ పల్లికి మధ్యలో ఉన్న కొండమీద నివాసముండే అప్పలస్వామి నాయుదుగారు తన పశువుల కొష్టంను కృపాదానం కుటుంబం నివశించడానికి ఇచ్చాడు. ఆ సమయంలో కృపాదానం హైదరాబాద్ వెళ్ళవలసి వచ్చినది. అక్కడ ఒక ప్రైవేట్ యల్.ఐ.సి. మేనేజర్‌తో కలిసి పనిచేయవలసి ఉన్నది.

భోజనం ఏర్పాటు ఇన్స్పెక్టర్‌గారి బాధ్యత. ప్రత్యేకంగా రూము తీసుకోవాలంటే చాలా డబ్బులు కావాలి. (ఆ రోజుల్లో అంటే 1948లో హైదరాబాద్‌లో చుట్టాలు ఎవరూ లేరు. ఆ రోజుల్లో అమీర్‌పేట కూడా ఇంకా పూర్తిగా మొదలు కాలేదు. బంజారా హిల్స్, నౌపద్ పహాడ్ లేదు. ఆబిడ్సు ముఖ్య కూడలి. చంచల్ గూడా జైలు హద్దు. తర్వాత పాతబస్తీ హైదరాబాద్) ఏం చేయాలి? ఎలా అనే ఆలోచనలలో ఉన్న కృపాదానంతో "దేవుని మీద ఎంత విశ్వాస ముంచుతామో మనకు అంత మేలు జరుగుతుందయ్యా అవిశ్వాసం వల్లనే మనకు ఆందోళన" అన్నది భార్య హన్నమ్మ. అసలు మనకు తెలిసిన వారు ఒక్కరైనా లేని ఊరు కదా అన్నాడు కృపాదానం.

మీ అమ్మ చనిపోయిన తర్వాతనే మీకు ఈ అవిశ్వాసం. మీ అమ్మ బ్రతికి ఉంటే అమ్మ నా కోసం ప్రార్థన చేస్తుందనే విశ్వాసంతో ఎక్కడైనా ధైర్యంగా తిరిగేవారు (అప్పటికి కృపాదానం అమ్మ చనిపోయి నెల రోజులు) అనగానే కృపాదానం కళ్ళల్లో నీళ్ళు నిండాయి. అది గమనించిన హన్నమ్మ దేవుడు మరణించ లేదండి. కాబట్టి ధైర్యంగా వెళ్ళండి. మీ ప్రయాణం అంతా ప్రార్థన చేస్తూనే వెళ్ళండి. నేను మీ కోసం ఇక్కడ ప్రార్థన చేస్తుంటాను కదా అంది. రైలులో స్లీపర్ కోచ్‌లు లేవు. కృపాదానం ఎక్కిన రైలు పెట్టెలో జనం నిండా వున్నారు. రాజమండ్రిలో కూర్చోవటానికి సీటు దొరికింది. కాని నిడదవోలులో ఓ వృద్ధ జంట ఎక్కారు. కృపాదానం కూర్చున్న సీటు ప్రక్కనే నిలబడ్డారు. తనకు సీటు ఇచ్చినందుకు దేవునికి కృతజ్ఞతలు చెల్లిస్తూ హైదరాబాద్‌లో తన బస కొరకు సహాయం చెయ్యమని మనసులో ప్రార్థిస్తూ ఉన్నాడు. తన ప్రక్కన నిలుచున్న ముసలివాళ్ళు ఇద్దరు క్రింద కూర్చునే స్థితిలో లేరు.ఆమెను చూస్తే తన తల్లి అక్కమ్మ జ్ఞాపకమునకు వచ్చింది. కృపాదానం లేచి నిలుచుని వారిద్దరిని కూర్చోమన్నాడు. వృద్ధ దంపతుల కళ్ళు మెరిశాయి. కృతజ్ఞతగా కృపాదానం వైపు చూసి కూర్చున్నారు. బండి ఎంత రద్దీగా ఉన్నదంటే రెండు కాళ్ళ మీద నిలుచునే స్థలం లేదు. ఒక కాలు మార్చి మరొక కాలు మీద నిలుచుంటూ విజయవాడ వరకు ప్రయాణం చేశాడు. విజయవాడలో వృద్ధుల ప్రక్కనే సీటు దొరికింది.

వారితో మాటల మధ్యలో వృద్ధులది హైదరాబాద్ స్వస్థలమని చెప్పారు. కృపాదానం సంగతి అంతా తెలుసుకున్నారు. హైదరాబాద్‌లో బండి దిగిన తర్వాత బాబు నీకు సంచి తప్ప ఏమిలేదుగా! మమ్మల్ని మా ఇంటి వద్ద దించి వెళ్తావా? అని అడిగారు. సరే అని వారి సామానులతో పాటుగా సిటిబస్‌లో బేగంపేట చేరారు ముగ్గురు. సామాను ఇంట్లో చేర్చిన తర్వాత వారి దగ్గర సెలవు తీసుకుంటుంటే నీవు మాతో కూడా ఉండాలని హైదరాబాద్‌లో ఉన్నంతకాలం భోజనం వసతి, మా ఇంట్లోనే గడపాలి అని మేము నిశ్చయించుకున్నాము. మా మాట కాదనకు. నువ్వు చెప్పిన మీ దేవుడే మనల్ని రైలులో కలపకపోతే మేము ఇక్కడిదాకా ప్రయాణం చేస్తామని అనుకోలేదు అని కన్నీరు పెట్టుకున్నది పెద్దామె. అయితే ప్రార్థన చేసేదా?అని అడిగాడు కృపాదానం. వారిద్దరు అన్యులు, వాళ్ళు ఒప్పుకుంటారా? అనుకుంటుండగా చెయ్యి నాయన! ఆయనే కదా మనల్ని కలిపింది అంది పెద్దామె.

**చందాదారుల వివరములు**

1. ప్రసాద్‌రావు గారు ( హైదరాబాద్) మొదటి నుండి కిరణ్ అనే పేరున పత్రికను పోషిస్తున్నారు.
2. డా॥ వినయ్‌కుమార్ (ఇ.యన్.టి అపోలో) – 5000 (ప్రతి సం॥ము)
3. డా॥. బి. ఉషా సతీష్ గారు (నెల్లూరు) – 2000 (ప్రతి సం॥ము)
4. దానం. మెర్సీ ఇశ్రాయేల్ గారు (నెల్లూరు) – 1000 (ప్రతి సం॥ము)
5. అపొ. ఎబినేజర్ గారు (హైదరాబాద్) – 1500 (ప్రతి నెల)
6. దాసరి పాల్ – 3000 (ప్రతి నెల)
7. గంధం. డేవిడ్ నీలకాంత్ (నెల్లూరు) –1000 (ప్రతి నెల)
8. ముద్ద. సామ్యేల్ విల్సన్ – 500 (ప్రతి నెల)
9. జి. స్టాలిన్ (కావలి)
10. పాస్టర్ కంచెర్ల ప్రభుదాస్ (గుంటూరు)
11. సుమతి చక్రవర్తి
12. దాసరి. మాధవరావు

**K. Emmanial Rajendra, SBI Main Branch, Ongole**

**A/c No. 10957294340**

# దేవుని ప్రేమించుదాం

ఈ లోకంలో జన్మించిన ప్రతి ఒక్కరికీ ప్రేమానుభవము ఉంటుంది. ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను, బిడ్డలను, స్నేహితులను, బంధువులను, జంతువులను, పక్షులను, ప్రకృతిని యిలా దేనిమీదనైనా ప్రేమ కలిగి ఉంటారు. ప్రేమానుభవం లేనివాళ్ళంటూ ఉండరు. ఎంత కసాయి వాడికైనా ఏదో ఒక దాని మీద ప్రేమ ఉంటుంది. అసలు ఏ సంబంధం లేనివాళ్ళ మీద కూడా ప్రేమ పుడుతుంది. ఇదంతా కళ్ళకు సంబంధించిన ప్రేమ. అంటే కనిపించే వారిని లేదా కనిపించే వాటిని ప్రేమించడం. ఆకర్షణ ద్వారా ప్రేరేపితమైన ప్రేమ. మరి దేవుడు కనిపించడు కదా మరి దేవున్ని ఎలా ప్రేమించాలి? అన్న అనుమానం రావచ్చు. ఎవరైనా ఒకరు ఇంకొకరిని హృదయపూర్వకంగా ప్రేమిస్తే, వారు లేనప్పుడు కూడా వారికి ఇష్టమైనట్లుగా జీవించటం, వారికి ఇష్టమైన పనులు చేయటం మనకు తెలుసు. మరి మనిషి లేనప్పుడు కూడా వారికిష్టమైన పనులు చేయడం ద్వారా ప్రేమించ గలిగినప్పుడు దేవుడు మనకు కనబడక పోయినప్పటికీ, మనం దేవున్ని హృదయపూర్వకంగా ప్రేమిస్తే దేవునికి ఇష్టమైనట్లు జీవిస్తాము, ఇష్టమైన పనులు చేస్తాము. మనం ఎవరినైనా ప్రేమిస్తే వారి గురించి ఎక్కువగా ఆలోచిస్తాము, వారి కోసం ఏదైనా చేయాలి అనుకుంటాము కదా! వారి పుట్టినరోజున అన్నదానాలు, రక్తదానాలు చేయడం, పేదలకు బట్టలు, పండ్లు ఇవ్వడం లాంటివి చేస్తాము. వారు మనతో ఉన్నా లేకపోయినా వారి మీద మనకు ఉన్న ప్రేమనుబట్టి వారిని జ్ఞాపకం చేసుకుంటుంటాము. అలాగే మనం దేవున్ని ప్రేమిస్తే దేవుని గురించి ఆలోచిస్తాము. మనం దేవుని గురించి ఎంత ఆలోచిస్తున్నాము, దేవుని కోసం ఏం చేయాలనుకుంటున్నాము అన్నదాన్నిబట్టి మనం దేవుని ప్రేమిస్తున్నామో లేదో తెలుస్తుంది. అలాంటి వారికోసం దేవుడు ఎన్నో మేలులు సిద్ధపరచి ఉంటాడు. అవి వారి కంటికి కనబడవు, చెవికి వినబడవు, మనుష్యహృదయానికి గోచరము కానివి *(1కొరింథీ 2:9)*. అంటే అవి వారి ఊహకు కూడా అందనివి. 'దేవుని ప్రేమించు వారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడినవారికి, మేలు కలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవి' (రోమా 8:28) అని చెప్పబడినట్లు దేవుని ప్రేమించే వారికోసం సమస్తము సమకూడి జరుగుతాయి. దేవున్ని ఎరుగని అన్యజనులవలె ఈ లోకానుసారమైన జీవితం జీవిస్తూ ఈ లోకములో దేవునికంటే సుఖానుభవమును ఎక్కువగా ప్రేమించు వారికి ఎలాంటి మేలు జరగదు *(2తిమోతి3:4)*. కాబట్టి మనం దేవున్ని ప్రేమించడం ద్వారా సమస్తమును పొందుకుందాము.


## ఇంటర్నెట్‌లో తెలుగు బైబిల్

**మీరు ఎక్కడున్నా సరే, మీ స్మార్ట్ ఫోన్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్‌లలో తెలుగు బైబిల్ చూడవచ్చును. అంతేకాక తెలుగు-ఇంగ్లీషు ప్యారలల్ బైబిల్, తెలుగు ఆడియో బైబిల్, తెలుగు బైబిల్ ఎన్‌సైక్లోపీడియా, తెలుగు ఆడియో, వీడియో పాటలు, తెలుగు పాటల రచనలు, అద్భుత సాక్ష్యములు, తెలుగు క్రైస్తవ సినిమాలు, బైబిల్ వాల్‌పేపర్స్, తెలుగు క్రైస్తవ పుస్తకములు, క్రైస్తవ వివాహ వేదిక, మీ ప్రార్థన అవసరతల కొరకు ప్రార్థనా గది... ఇంకా మరెన్నో మీ కోసం... నేడే దర్శించండి... www.onlinetelugubible.net**

**www.onlinetelugubible.net**

# దేవుడు - సిరి

మనం ప్రేమించేవాళ్ళు మనకంటే బాగుండాలని, మన కంటే అందంగా ఉండాలని, బలంగా ఉండాలని, మన కంటే అన్నిటిలో ఎక్కువగా వాళ్ళని దేవుడు చూసినప్పుడే మనకు సంతోషం. ఈ భావన మనకు మన లోపల ఉన్న ప్రేమను బయటకు కనపరుస్తుంది. ఇందులో మాటలకు పనిలేదు. కేవలం చేతలలో మనం కనపరచి నపుడే మనకు నిజమైన సంతృప్తి కలుగుతుంది. అసలు మన ప్రేమను చేతలలో చూపిన తర్వాత మనకు హృదయంలో తృప్తి కలుగుతుంది.

యేసుని ప్రేమించే వాళ్ళు ఈ లోకములో ఆయనను అన్ని విషయాలలో ఎక్కువగా చూస్తారు. మనకు విశ్వాసము ఉంటే ఉండవచ్చును, కాని ప్రేమతో కూడిన విశ్వాసమే ఫలవంతమవుతుంది. యేసును ప్రేమిస్తే ఆయన బిడ్డలను (యధార్ధమైన వాక్యోపదేశకులను, ఆయన సంఘాన్ని) ప్రేమిస్తాము. ఇది ఆజ్ఞకు బద్ధులమై నెరవేర్చే క్రియ కాదు గాని, హృదయంలో నుండి మన ప్రయత్నం లేకుండా బయటకు ప్రవహించే ప్రేమ. ఈ ప్రక్రియ మన హృదయంలో జరుగుతుందా? లేదా? అన్నది మనమే గుర్తించగలగాలి.

మనం దేనిని ప్రేమిస్తామో దానికి హృదయపూర్వకంగా దాసులమవుతాము. ఆ దాసత్వంలో ఉన్నందు వలన వచ్చే ఇబ్బంది మనకు కనపడదు. ఆ ఇబ్బందులలో ఎంతో హాయిగా ఉంటుంది. ఇక్కడ ఈ లోకంలో మనకు ఊహ తెలిసిన నాటినుండి రెండిటిలో దేనికో ఒకదానికి దాసుల మవుతాము తప్పించుకోలేము. యేసుప్రభువు నిక్కచ్చిగా చెప్పాడు 'మీరు దేవునికిని, సిరికిని దాసులుగా ఉండనేరరు' అని ఇది యేసుప్రభువు ఇచ్చిన స్టేట్‌మెంట్. దీనికి కామెంటరీ ఏమిలేదు. అందరికి దీని భావము పూర్తిగా అర్థమవుతుంది. అంటే ఈ లోకంలో ప్రతి మనిషి ఈ రెండిటిలో ఒకదానికి బానిస అయివుంటాడు. దేవునికిని, సిరికిని కలుపుకొని ఇద్దరికిని బానిసగా ఉండగలమని కాని, ఉన్నాము అని కాని మనం యేసుతో చెప్పలేము. ఎందుకంటే ఎవడును ఇద్దరు యజమానులకు దాసుడుగా ఉండలేడు. ఒక వ్యక్తి ఇద్దరు యజమానులకు సేవ చేయలేడు. అలా చేస్తే అతడు ఒకణ్ణి ప్రేమించి ఇంకొకరిని ద్వేషిస్తూ ఉంటాడు. లేదా ఒకనికి అత్యంత శ్రద్ధతో సేవచేసి ఇంకొకనిని అశ్రద్ధ చేస్తాడు. మీరు దేవునికిని, డబ్బుకు సేవకునిగా ఉండలేరు.

ఇప్పుడు చెప్పండి నీవు దేవుని ఆజ్ఞ అయిన దశమ భాగమును ప్రేమతో ఇస్తున్నావా? దేవుని ప్రేమించకపోతే ఎవడును ఆయనతో నడువలేడు. ఆయనతో నడువని త్రోవ ముగింపు ఎలా వున్నా, ఈలోకంలో ఉండగానే పరలోకంలో ప్రవేశించము. ఈ లోకంలో ఉండగానే పరలోకంలో జీవించకపోతే ప్రేమ, విశ్వాసాలను బంధించే నిరీక్షణను కలిగియుండలేము. కనుక ఆయనకు అయిష్టులైన వారికి భూమి మీద సమధానము లేదు. ఇంటిలో సమాధానము లేదు. కారణం దొంగిలిన సొమ్ము మన ఇంటిలో ఉన్నది. దొంగసొమ్ము ఇంట్లో పెట్టుకొని ఏ మానవుడు సంతోషంగా సమాధానంగా ఉండలేడు.

మన చుట్టుప్రక్కల దశమభాగము విషయంలో నిక్కచ్చిగా ఉండేవారిని అడగండి. వారు సమృద్ధిలో ఉన్నారా? వారి రాబడితో సంబంధం లేకుండా వారి వనరులతో సంబంధం లేకుండా ఇంటిలో, ఉద్యోగంలో, చదువులో, ఆరోగ్యంలో సమృద్ధిగా ఉన్నారా? లేకుంటే దేవునికి దాసులుగా లేరన్న మాట.

దేవుడే మనకు సవాలు విసురుతున్నాడు. "మీరు దీని చేసి నన్ను శోధించిన యెడల నేను ఆకాశపు వాకిండ్లను విప్పి, పట్టజాలనంత విస్తారంగా దీవెనలు కుమ్మరించెదను. ఆయన కుమ్మరిస్తే అది మనం చేదవేసుకోలేనంత, మనం పట్టుకోలేనంత విస్తారంగా నేను ఇస్తాను అని అనలేదు. నేను కుమ్మరిస్తాను అంటున్నాడు.

# లోకంతీరు

(పుట్టుక చావు మధ్య సంబరం)

**"మనుష్యుడు ఏపాటివాడు? అతని ఘనపరచనేల? అతని మీద నీవు మనస్సు నిలుపనేల?" యోబు 7:17**

ఈ వాక్యాలను మనం పరిశీలించినట్లయితే దేవుడు మనుష్యుల పట్ల ఎంతటి బాధ్యత కలిగియున్నాడో అర్థమవు తుంది. **"నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణ హృదయ ముతో నమ్మకముంచుము, నీ ప్రవర్తన అంతటియందు ఆయన అధికారము నకు ఒప్పుకొనుము. అప్పుడు ఆయన నీ త్రోవలను సరాళము చేయును"** సామెతలు 3:5,6. ఎవరికి వారు తమ స్వంత ఆలోచనల ప్రకారం నడవకుండా హృదయపూర్వకంగా దేవున్ని నమ్మి, వారు చేసే ప్రతి పనిలో దేవుని అధికారానికి ఒప్పుకుంటే అప్పుడు వారు నడవవలసిన దారిలో దేవుడు చక్కగా నడిపి స్తాడు. **"నీకు ప్రయోజనము కలుగునట్లు నీ దేవుడనైన యెహోవానగు నేనే నీకు ఉపదేశము చేయుదును, నీవు నడవవలసిన త్రోవను నిన్ను నడిపించుదును"** 48:17. మనకి ఏది లాభ సాటిగా వుంటుందో అది దేవుడు మనకు తెలియజేస్తాడు, అందుకు కావలసిన వనరులన్నీ సమకూరు స్తాడు. **"యెహోవా యందు భయభక్తులు గలవాడెవడో వాడు కోరుకొనవలసిన మార్గమును ఆయన వానికి బోధించును"** కీర్తనలు 25:12. మన మీద దేవునికి పూర్తి అధికారం ఇస్తే ఆయన మన ఆలోచనలని కూడా నియంత్రించి మనం ఏం కోరుకోవాలో కూడా ఆయనే మనకు చెప్తాడు.

**పుట్టుక**

**దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికా రంధ్రములలో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను (ఆది.2:7)**

దేవుడు మనిషికి ఇచ్చే ప్రాధాన్యతని మనిషి గుర్తించకుండా తన పూర్తి జీవితాన్ని తానే నడిపించుకోవాలనే అపోహతో దేవునికి తన జీవితం మీద ఏ మాత్రం అజమాయిషి ఇవ్వడం లేదు. **'నేను'** అనుకొనే స్థాయి వచ్చినప్పటి నుండి తనకు కావలసినవన్నీ సమకూర్చుకునే పనిలో నిమగ్నమైపోయి, తన జీవితాన్ని భారంగా నడిపించుకుంటు దేవుడు మనిషికి ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్నాడు. దేవునికి ఏ మాత్రం విలువ ఇవ్వకుండా, తోటి మనుష్యులకు ఎక్కువ విలువ ఇస్తూ, ఆ మనుష్యుల ద్వారా మెప్పు పొందాలనే తాపత్రయంతో దేవున్ని పట్టించుకోవడం లేదు. ఈ లోకంలో తనకు ఒక స్థాయి సంపాదించుకోడానికి మనిషి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నాడు. ఇతరులు తనను గౌరవించాలని, తనకు ఎంతో విలువ ఇవ్వాలని, ఈ లోకంలో తనకంటూ ఒక గుర్తింపు రావాలని పడరాని పాట్లు పడుతూ దేవుని ప్రేమకు దూరమవుతున్నాడు. దేవుని కంటే మనుష్యులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం వలన దేవుడు తనికు ఇచ్చిన ప్రాధాన్యతను తనకు తానుగా తగ్గించుకుంటున్నాడు. ఇతరుల కంటే తాను ఏ మాత్రం తక్కువగా ఉండ కూడదు అన్న భావంతో తగ్గింపు గుణమును తృణీకరించి దేవునికి దూరమవుతున్నాడు.

దేవుడు ఆదాము, హవ్వలకు తినడానికి ఆహారము తప్ప ఇంకేమి ఇవ్వలేదు. వారు దేవుని ఆజ్ఞను అతిక్రమించి పాపము చేసి దేవునికి దూరమై, ఏదెను తోటలో ఉండే అర్హత కోల్పోయినప్పుడు దేవుడు వారికి వస్త్రములను ధరింపజేశాడు. మత్తయి సువార్త 6:25లో దేవుడు ఆహారము గూర్చి, వస్త్రములను గూర్చి ప్రస్తావిస్తూ వాటి గురించి చింతించవద్దు అని చెప్పాడు. అయితే నేటి కాలంలో మనుష్యులు దేని గురించి చింతిస్తున్నారు? గొప్పవారు కావడా నికి, తమ స్థాయి పెంచుకోవడానికి చింతిస్తున్నారు. **'నేను'** అనుకొనే స్థాయి వచ్చిన తర్వాత మనిషి అన్వేషణ అంతా తన స్థాయి పెంచుకోవడానికే. స్థాయి పెరగటం అంటే తన పొరుగు వారికంటే ఉన్నత స్థితిలో ఉండాలనుకోవడం. తన చుట్టూ నివసించే వారి జీవనశైలికంటే తన జీవనశైలి ప్రత్యేకంగా ఉండాలని కోరుకోవడం. అందుకు తగ్గ ప్రణాళికలు రూపొందిచుకొని దేవుడు తనకు అనుగ్రహించిన

ఆరోగ్యాన్ని, తెలివితేటలను వాటికోసం ధారపోసి తన జీవితాన్ని ముగించుకుంటాడు. ఈ లోకంలో తనకు ఏమి అవసరమో తనకు తానే నిర్ణయించుకుంటాడు. అహారము కంటే ప్రాణమును, వస్త్రము కంటే దేహమును గొప్పవి కావా? అని దేవుడు అంటుంటే, దేవుడు అనుగ్రహించిన తన ప్రాణాన్ని, దేహాన్ని సైతం లెక్క చెయ్యకుండా ఈ లోకాన్ని మెప్పించడానికి వాటిని పణంగా పెడుతున్నాడు.

ఈ లోకంలో మనిషి పుట్టిన తర్వాత చనిపోయే వరకు జీవించాలంటే మనిషికి అవసరమైనది ఆహారం ఒక్కటే. ఆకలితో ఉన్నప్పుడు మనిషి ఆహారం గురించి తప్ప ఇంక వేరే ఏమీ ఆలో చించడు. ఆకలే లేకపోతే మనిషికి ఆహారంతో పనిలేదు. అలాంటి ఆకలిని దేవుడు కలుగ జేసింది మనిషిని పరీక్షించడానికే. "ఆహారము వలననే గాక యెహోవా సెలవిచ్చిన ప్రతిమాట వలన నరులు బ్రదుకుదురని నీకు తెలియజే యుటకు ఆయన నిన్ను అణచి నీకు ఆకలి కలుగ జేసి...." (ద్వితీయో. 8:3). అంటే మనిషి ఆకలిగా వున్నప్పుడు ఆహారము వలన మాత్రమే కాక దేవుడు సెలవిచ్చిన ప్రతి మాట వలన మనుష్యులు బ్రతుకుతారు అని ఆహారానికి ప్రత్యామ్నాయం చూపించాడు. ఆకాశ పక్షులను చూడుడి అవి విత్తవు కోయవు కొట్లతో కూర్చుకొనవు, అయినను మీ పరలోకపు తండ్రి వాటిని పోషించుచున్నాడు, మీరు వాటికంటే బహు శ్రేష్ఠులుకారా? (మత్తయి 6:26) అని దేవుడు చెప్తుంటే. దానేని ఎవరూ అంగీకరించటం లేదు. దేవుడు తన స్వరూపంలో తన పోలిక చొప్పున, తన స్వహస్తాలతో సృజించుకున్న మనిషికి మరి నిశ్చయంగా ఆహారమును, వస్త్రములను, తల దాచుకొనుటకు గూడును అనుగ్రహిస్తాడు కదా! వీటి కోసమేగా మనిషి ప్రయాసంతా. మనిషి జీవించడానికి అవసరమైన వాటిని దేవుడు అనుగ్రహిస్తాడు, మరి మనిషి ఎందుకని దేవునికి దూరమవుతున్నాడు? ఎందుకంటే మనిషి తను జీవించటానికి తన ప్రాణమునకు, దేహమునకు అవసరం లేనివాటిని కోరకోవడం వలన. అంటే ఈ లోకంలో తన స్థాయిని పెంచి, ఈతరుల ముందు తనను గొప్పవాడిగా చూపించే విలాస వంతమైన జీవితం కోరుకోవడం వలన మనిషి దేవునికి దూరమవుతున్నాడు.

**చా వు**

**ఏలయనగా నేల నుండి నీవు తీయబడితివి; నీవు మన్నే గనుక తిరిగి మన్నైపోదువని చెప్పెను (ఆది.3:18)**

విలాసవంతమైన జీవితం అంటే తన స్థాయికి తగినంత కంటే ఎక్కువగా వుండాలని కోరుకోవడం. ప్రతి ఒక్కరూ ముందుగా తనకు ఒక సొంత ఇల్లు కట్టుకొని స్థిరపడాలని కోరుకుంటాడు. గుడిసెలో జీవించే వాడు శ్లాబు వేసిన ఒక పక్కా ఇల్లు వుంటే బాగుంటుంది అనుకుంటాడు, పక్కా ఇంట్లో వుండే వాడు, ఇంకా ఎక్కువ గదులు వుండే మేడలో వుండాలని కోరుకుంటాడు, రెండంతస్తులు ఉన్నవాడు నాలుగంతస్తులు కోరుకుంటాడు. ఇంకా ఇంటికి సంబంధించిన వస్తువులు, కార్లు, స్థలాలు, పొలాలు, బంగారం, డబ్బు ఎంత ఎక్కువగా సంపాదిస్తే తన స్థాయి అంత పెరుగుతుంది. కాబట్టి వీటి సంపాదనే ధ్యేయంగా తన జీవితం వుంటుంది.

డబ్బు ఎంత సంపాదిస్తే తనకు సరి పోతుంది అన్నదానికి మితం లేదు. డబ్బు సంపాదించడానికి రకరకాల మార్గాలు అన్వేషి స్తుంటాడు. ఉద్యోగం ద్వారానో, వ్యాపారం ద్వారానో వచ్చే డబ్బు తన విలాసాలకి సరి పోకపోతే ఇంకా ఇతర మార్గాల ద్వారా సంపా దించాలని కోరుకుంటాడు. ఒక మనిషి తన కొరకు రోజుకి వెయ్యి రూపాయలు ఖర్చు చేస్తే 70 సంవత్సరాలకు 2 కోట్ల 52 లక్షలు ఖర్చు చేస్తాడు. ఒకవేళ ఆ మనిషి 10 కోట్లు సంపాదించినా ఇంకా సంపాదించాలి అనుకుంటాడు. చనిపోయే వరకు కూడా సంపాదిస్తూనే ఉంటాడు. ఈ లోకములోని భోగాలను అను భవించడానికే మనిషి సంపాదిస్తుంటాడు.

**(ఇంకా వుంది)**


## ప్రకటన

**క్రైస్తవ కథలు, వ్యాసాలు, రచనలు, కవితలు, పాటలు మొదలగునవి మా ప్రియ పాఠకుల నుండి కోరడమైనది. ఆసక్తి గలవారు తమ తమ భావాలను మా పత్రిక ద్వారా పాఠకులకు అందించవచ్చు. ఉత్తమ కథకు నగదు బహుమానం వుంటుంది. క్రైస్తవకథ ఏదైనా 2 పేజీలకు మించకూడదు.**

## కొడవటికంటిగారి రచనలు

| | | | |
|---|---|---|---|
| 1. | మడిమెను పట్టుకొనినవాడు | రూ. | 40 |
| 2. | జప్పత్పనేహు | రూ. | 45 |
| 3. | ఆసెనతు | రూ. | 150 |
| 4. | అపొస్తలుడు | రూ. | 60 |
| 5. | బర్నబా | రూ. | 30 |
| 6. | తిమోతి | రూ. | 40 |
| 7. | నా చిత్తానుసారుడు | రూ. | 110 |
| 8. | గుంట నుండి మింటికి | రూ. | 50 |
| 9. | విశ్వాసంలో ఓ మెట్టు | రూ. | 60 |
| 10. | విశ్వాసంలో మరో మెట్టు | రూ. | 65 |
| 11. | తోటలో పనివాడు | రూ. | 20 |
| 12. | గోత్రకర్త (యాకోబు) | రూ. | 50 |
| 13. | నా కుటుంబము | రూ. | 25 |
| 14. | నా దూత (బాప్తిస్మమిచ్చు యోహాను) | రూ. | 50 |
| 15. | నా కుమారి (రూతు) | రూ. | 60 |
| 16. | నా స్నేహితుడు | రూ. | 50 |
| 17. | అంత్యదినములలోని యదార్ధ ప్రవక్త | రూ. | 50 |
| 18. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -1 | రూ. | 65 |
| 19. | హన్నాకృప సజీవసాక్ష్యాలు -2 | రూ. | 65 |
| 20. | ప్రయాణంలో ఓ మజిలి | రూ. | 65 |
| 21. | నాజరు (సమ్సోను జీవిత చరిత్ర) | రూ. | 65 |
| 22. | సువార్తలలోని యేసుకథ | రూ. | 75 |
| 23. | యేసుకథ రెండవ భాగం | రూ. | 75 |
| 24. | యేసుకథ మూడవ భాగం | రూ. | 75 |
| 25. | జీవనమంతయు | రూ. | 40 |
| 26. | టాల్‌స్టాయ్ కథలు 1 భాగము | రూ. | 65 |
| 27. | టాల్‌స్టాయ్ కథలు 2వ భాగము | రూ. | 65 |
| 28. | ఓ చినుకునవుతా... | రూ. | 30 |
| 29. | విశ్వాసము విజయము-1 | రూ. | 70 |
| 30. | విశ్వాసము విజయము-2 | రూ. | 70 |
| 31. | విశ్వాసము విజయము-3 | రూ. | 70 |
| 32. | హదస్సా | రూ. | 70 |
| 33. | పరలోకము - నరకము | | |


పుస్తకములు కావలసినవారు :

**రెవ. డా॥ కొడవటికంటి సామ్యేల్ రాజేంద్ర**

కృపాదానంగారివీధి, క్లాపేట, 6వ లైను,

ఒంగోలు-523001, ప్రకాశం జిల్లా,

ఫోన్ : 9866716506, 9440217726


## సండేస్కూల్ మెటీరియల్

| | |
|---|---|
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-1 | రూ. 35/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-2 | రూ. 35/- |
| సండేస్కూల్ యాక్టివిటి బుక్-3 | రూ. 45/- |
| సండేస్కూల్ కలరింగ్ బుక్ | రూ. 35/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-1 | రూ. 35/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-2 | రూ. 45/- |
| సండేస్కూల్ బైబిల్ స్టోరీస్ బుక్-3 | రూ. 45/- |
| మార్గము-వి.బి.యస్. మెటీరియల్ | రూ. 25/- |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (ఒ.టి.) | రూ. 20/- |
| బిగినర్స్ యాక్టివిటి బుక్ (యన్.టి.) | రూ. 20/- |
| సండేస్కూల్ సాంగ్స్ బుక్ | రూ. 40/- |
| సండేస్కూల్ డైరి | రూ. 50/- |
| సండేస్కూల్ స్టోరీస్ బుక్-1 | రూ. 25/- |
| సండేస్కూల్ స్టోరీస్ బుక్-2 | రూ. 35/- |
| సండేస్కూల్ టీచర్స్ గైడ్ | రూ. 40/- |
| సండేస్కూల్ స్కిట్స్ | రూ. 35/- |
| సండేస్కూల్ మెమోరి వర్సెస్ బుక్ | రూ. 10/- |
| సండేస్కూల్ స్టిక్కర్స్ (32 ప్యాక్) | రూ. 160/- |

### సండేస్కూల్ గేమ్స్

| | |
|---|---|
| బైబిల్ ఇండెక్స్ గేమ్ | రూ. 200/- |
| బైబిల్ ఫ్యామిలి నేమ్స్ గేమ్ | రూ. 200/- |
| బైబిల్ నేమ్స్ గేమ్ | రూ. 300/- |
| బైబిల్ వర్సెస్ స్టార్ గేమ్ | రూ. 250/- |
| బైబిల్ నేమ్స్ ప్రిడిక్షన్ గేమ్ | రూ. 120/- |
| బైబిల్ క్విజ్ గేమ్ | రూ. 300/- |
| యానిమల్స్ అండ్ బర్డ్స్ ఇన్ బైబిల్ గేమ్ | రూ. 300/- |
| హెవెన్ అండ్ హెల్ మెమోరి వర్సెస్ గేమ్ | రూ. 350/- |
| ఫ్రూట్స్ ఆఫ్ స్పిరిట్ బోర్డ్ గేమ్ | రూ. 350/- |
| ట్యాబర్‌నికల్ బోర్డ్ గేమ్ | రూ. 350/- |
| ఈజిప్ట్ టు కానాన్ జర్నీ బోర్డ్ గేమ్ | రూ. 350/- |


వివరాలకు : **బైబిల్ లిటరేచర్ మినిస్ట్రీ**

కృపాదానంగారివీధి, క్లాపేట, 6వ లైను,

ఒంగోలు-523001, ప్రకాశం జిల్లా,

ఫోన్ : 9440217726